thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

| సంపుటి : 21 | సంచిక : 40 | జగిత్యాల | గురువారం | 30 ఏప్రిల్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

### ముంబై పై సన్ రైజర్స్ సంచలన విజయం



11




## తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి
# గ్రీన్ సిగ్నల్

- 150 మీటర్ల ఎత్తున నిర్మాణం..
- మహారాష్ట్రను ఒప్పించే బాధ్యత కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి!
- ముంపు వాటిల్లితే పరిహారానికి సిద్ధం..
- కాంగ్రెస్ మేనిఫెస్టో హామీ అమలు దిశగా అడుగులు
- సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

**హైదరాబాద్, ఏప్రిల్29 :** ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణ కార్యాచరణను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఇరిగేషన్ శాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మరియు ఉన్నతాధికారులతో భేటీ అయిన సీఎం, బ్యారేజ్ నిర్మాణ ప్రతిపాదనలపై సమగ్రంగా చర్చించారు. 150 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మిస్తే మహారాష్ట్రలో ముంపు ప్రభావం పెద్దగా ఉండదని, ఒకవేళ ముంపు వాటిల్లితే బాధితులకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. తుమ్మిడిహట్టి బ్యారేజ్ విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాల్సిందిగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ రాయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సీఎం సూచించారు. ఇక్కడి నుంచి నీటి తరలింపు

మిగతా 2 లో

## రిటైర్డ్ ఉద్యోగులకు
# తీపి కబురు



బకాయిల చెల్లింపులకు వేయికోట్ల విడుదల
ఉత్తర్వులు జారీ చేసిన ఆర్థిక శాఖ

# హైదరాబాద్ మెట్రో ప్రభుత్వ పరం



వందశాతం షేర్ల బదిలీ పూర్తి

వివరాలు 2వ పేజీలో

## పదో తరగతి ఫలితాల్లో
# బాలికలదే పైచేయి!

### రాష్ట్రంలో 95.1 శాతం ఉత్తీర్ణత నమోదు

మొదటి స్థానంలో ములుగు.. చివరన హైదరాబాద్

ఫలితాలను విడుదల చేసిన ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు

2



## మే 4న ఐదు రాష్ట్రాల్లో గెలిచి
# హ్యాట్రిక్ సాధిస్తాం

- బెంగాల్‌లో భయరహితంగా పోలింగ్..
- విపక్షాల కోటలు బద్దలు కావడం ఖాయం
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- హర్దోయీలో 'గంగా ఎక్స్‌ప్రెస్‌వే' ప్రారంభం

4



# పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత లేదు

కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

3



## అధికారం రావడం.. పోవడం రొటీన్

హామీలు గుప్పించి.. ప్రజలను మోసం చేస్తున్న రేవంత్

కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగం అవుతామని కేసీఆర్ ఆనాడే హెచ్చరించారు

రేవంత్‌తో నాకేమీ వ్యక్తిగత పంచాయితీ లేదు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



.. వివరాలు 3లో

# జోరుగా ధాన్యం కొనుగోళ్లు



- 90 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణే లక్ష్యం
- ఇప్పటికే మిల్లులకు 7 లక్షల మెట్రిక్ టన్నులు
- రైతులకు రూ. 323 కోట్ల చెల్లింపులు
- పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ..
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

2




# విద్యార్థులకు శుభవార్త

స్కాలర్‌షిప్ బకాయిల విడుదలపై డిప్యూటీ సీఎం భట్టి కీలక నిర్ణయం

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే క్లియర్ చేయాలని అధికారులకు ఆదేశం

3

# హైదరాబాద్‌లో హైనెకెన్ గ్లోబల్ సెంటర్


ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

ఐటీ, ఫైనాన్స్ రంగాల్లో వేలాది మందికి ఉపాధి..

76 వేల చదరపు అడుగుల్లో భారీ కార్యాలయం

2






4

'ఇక మీదట అంత మంచివాడిగా ఉండను' అని ట్రంప్ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడం, అమెరికా-ఇరాన్‌ల మధ్య దౌత్యపరమైన ప్రతిష్టంభన నెలకొన్న వేళ ట్రంప్ నుంచి ఈ ప్రకటన వెలువడింది.

## ఇకమీదట మంచోడిగా ఉండను

# బెంగాల్‌లో రికార్డు స్థాయి పోలింగ్

- మమత మళ్లీ 'దీదీ' అనిపిస్తుందా?
- టీఎంసీ వర్సెస్ బీజేపీ.. హోరాహోరీ పోరులో ఎగ్జిట్ పోల్స్ భిన్నాభిప్రాయాలు
- ముస్లిం ఓటర్లు, మహిళా సెంటిమెంట్ టీఎంసీకి బలం..
- బెంగాలీ పౌరుషం విజయం సాధిస్తుందా?

2





# పదో తరగతి ఫలితాల్లో బాలికలదే పైచేయి!

## రాష్ట్రంలో 95.1 శాతం ఉత్తీర్ణత నమోదు

### మొదటి స్థానంలో ములుగు.. చివరన హైదరాబాద్

**ఫలితాలను విడుదల చేసిన ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు**

**హైదరాబాద్, ఏప్రిల్ 29:** తెలంగాణ పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం మధ్యాహ్నం ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు ఫలితాలను విడుదల చేశారు. మొత్తం 95.1 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది 5 లక్షల 28 వేలకు పైగా విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. టెన్త్ ఫలితాల్లో బాలికలదే పైచేయిగా నిలిచింది. బాలికలు 96.26 శాతం ఉత్తీర్ణత సాధించగా.. బాలురు 94.07 శాతం ఉత్తీర్ణత పొందారు. 5,731 స్కూళ్లలో వంద శాతం ఉత్తీర్ణత నమోదవగా.. 6 పాఠశాలల్లో సున్నా శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు విద్యాశాఖ వెల్లడించింది. పదో తరగతి ఫలితాలను 8096958096 అనే మీ సేవా వాట్సాప్ ద్వారా తెలుసుకోవచ్చు. మీ సేవా వాట్సాప్ నెంబర్‌కు విద్యార్థులు హాయ్ అని మెసేజ్ టైప్ చేయాలి. తర్వాత ఎస్ఎస్సి రిజల్ట్స్ అని టైప్ చేసి హాల్ టికెట్ నెంబర్‌ను ఎంటర్ చేస్తే ఫలితాలను చూడొచ్చు. ఇకపోతే సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 99.10 శాతం ఉత్తీర్ణత సాధించారు. తెలుగు మీడియం విద్యార్థుల్లో 89.14 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. ఇంగ్లీష్ మీడియం విద్యార్థుల్లో 95.86 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. ఉర్దూ మీడియం విద్యార్థుల్లో 86.71 శాతం నమోదయ్యింది. ములుగు జిల్లాలో అత్యధికంగా 99.30 శాతం ఉత్తీర్ణత సాధించారు. హైదరాబాద్ జిల్లాలో అత్యల్పంగా 89.23 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. గ్రేడ్స్ మాత్రమే కాకుండా సబ్జెక్టుల వారీగా మార్కులను వెల్లడించారు.

# హైదరాబాద్ మెట్రో ప్రభుత్వ పరం

**వందశాత్ షేర్ల బదిలీ పూర్తి**



**హైదరాబాద్, ఏప్రిల్ 29:** హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశ ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వ పరమైంది. ఎల్ అండ్ టీతో షేర్ల కొనుగోలు ఒప్పందం పక్రియ పూర్తయ్యింది. రూ.1,461.47 కోట్ల విలువైన వంద శాతం షేర్ల బదిలీ జరిగింది. ఈ ఒప్పందంపై హెచ్ఎంఆర్ఎల్ తరఫున ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, ఎల్ అండ్ టీ లిమిటెడ్ తరఫున డీకే సేన్, ఎల్అండ్‌టీ మెట్రోరైలు హైదరాబాద్ లిమిటెడ్ తరఫున కేవీబీ రెడ్డి సంతకాలు చేశారు. వాస్తవంగా మార్చి 31ని మెట్రో స్వాధీన తేదీ అనుకున్నప్పటికీ.. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) నుంచి రుణం మంజూరు ఆలస్యం కావడంతో గడువును ఏప్రిల్ 30కి పొడిగించారు. ఎల్ అండ్ టీ, మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ సంస్థ 2017 నవంబర్ నుంచి మూడు కారిడార్లలో మొత్తం 69 కిలోమీటర్ల నెట్‌వర్క్‌తో హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-ఎను నిర్వహిస్తోంది. మెట్రోలో ప్రస్తుతం రోజుకు సుమారు 4.50 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఫేజ్-ఎను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో ఫేజ్-ఎ, ప్రతిపాదిత ఫేజ్-ఎఎ నెట్‌వర్క్ రూపకల్పన, పనులు, సేవల అమలు సులభతరమవుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

# రిటైర్డ్ ఉద్యోగులకు తీపి కబురు

**బకాయిల చెల్లింపులకు వేయికోట్ల విడుదల.. ఉత్తర్వులు జారీ**

**హైదరాబాద్, ఏప్రిల్ 29:** ఇటీవల కేబినేట్‌లో తీసుకున్న నిర్ణయం మేరకు తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా తొలివిడతలో బుధవారం వేయికోట్లను ఆర్థికశాఖ విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టమైన ఆదేశాల మేరకు, ఉద్యోగుల పెండింగ్ బకాయిల కోసం రూ. 1000 కోట్ల నిధులను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా ఈ మేరకు నిధుల విడుదల చేయటం జరిగింది. గత ఏడాది ఉద్యోగ సంఘాలతో జరిగిన చర్చల సందర్భంగా ప్రభుత్వం నెలకు రూ. 700 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చింది. ఆ ప్రకారంగా మార్చి 2026 వరకు ప్రతినెల ఉద్యోగులకు ఇచ్చిన మాటను ప్రభుత్వం అమలు చేసింది. అయితే, ఉద్యోగుల ఆర్థిక అవసరాలను, వారు పడుతున్న ఇబ్బందులను స్వయంగా గమనించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఆ మొత్తాన్ని రూ. 1000 కోట్లకు పెంచాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే ఏప్రిల్ నెలకు సంబంధించిన వెయ్యి కోట్ల రూపాయలను యుద్ధ ప్రాతిపదికన విడుదల చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ బకాయిలను సర్కార్ చెల్లించింది. దీంతో 2025 అక్టోబర్ వరకు బకాయిలను ప్రభుత్వం క్లియర్ చేసింది. గతంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ఇప్పటివరకు ప్రతి నెల ఉద్యోగుల బకాయిల కోసం ప్రభుత్వం రూ.700 కోట్ల చొప్పున చెల్లిస్తూ వస్తోంది. ఏప్రిల్ బకాయిల చెల్లింపులను రూ.700 కోట్ల నుంచి రూ.1000 కోట్లకు పెంచింది. మిగిలిన ఉద్యోగులకు సంబంధించి త్వరలోనే నెలకు వెయ్యి కోట్ల చెప్పున విడుదల చేస్తూ బకాయిలన్నింటీని క్లియర్ చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఉద్యోగుల మెడికల్ బిల్లులను కూడా ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా ప్రభుత్వం చెల్లిస్తోంది. అక్టోబర్ 2025 వరకు పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలన్నింటినీ ఈ నిధులతో పూర్తిగా క్లియర్ చేశారు. తమ పదవీ విరమణ ప్రయోజనాల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది సీనియర్ సిటిజన్లకు ఇది గొప్ప ఊరటనిచ్చే అంశం. ఉద్యోగుల ఆరోగ్య అవసరాలకు సంబంధించి మెడికల్ బిల్లులను ఒక్క రోజు కూడా ఆలస్యం చేయకుండా, ప్రాధాన్యత క్రమంలో ఎప్పటికప్పుడు చెల్లించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ప్రస్తుతం మెడికల్ బిల్లుల చెల్లింపులు అత్యంత వేగంగా జరుగుతున్నాయి. ఉద్యోగుల ఆరోగ్య భద్రత విషయంలో రాజీ పడకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్క రోజు కూడా జాప్యం లేకుండా మెడికల్ బిల్లుల చెల్లింపులు రెగ్యులర్ గా జరిగేలా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఉపముఖ్యమంత్రి చొరవతో పెద్ద మొత్తంలో నిధులు విడుదల కావడం పట్ల ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

# తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

మొదటి పేజీ తరువాయి

సులభంగా ఉండటమే కాకుండా, నీటి లభ్యత కూడా పుష్కలంగా ఉంటుందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుపై ఇప్పటికే రూ. 11 వేల కోట్లు ఖర్చు చేసినట్లు ఈ సందర్భంగా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించేందుకు ఆర్వీ అసోసియేట్స్ మరియు ఐఐటీ హైదరాబాద్ సమిష్టిగా రూపొందించిన నాలుగు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ప్రతి ప్రతిపాదనకు అయ్యే ఖర్చు, లాభనష్టాలపై క్షుణ్ణంగా సమీక్షించిన అనంతరం తుది నిర్ణయం తీసుకోనున్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల,



అన్నారం బ్యారేజ్‌ల పునరుద్ధరణకు అవసరమైన ఎస్పీటీ, పెర్మిబిలిటీ పరీక్షలను వర్షాకాలం లోపు పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. బోర్ల ప్రక్రియలో రాయి వచ్చినప్పటికీ ఐదు మీటర్ల లోతు వరకు డ్రిల్లింగ్ చేయాలని సూచించారు. పునరుద్ధరణ పనుల పర్యవేక్షణకు నియమించిన సమన్వయ కమిటీ క్షేత్రస్థాయిలో ఉంటూ టైంలైన్ ప్రకారం పనులు పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# జోరుగా ధాన్యం కొనుగోళ్లు

**పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**

**హైదరాబాద్, ఏప్రిల్29 :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా యాసంగి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ అత్యంత వేగంగా, పారదర్శకంగా సాగుతోందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పిస్తూ, ఎక్కడా ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేయగా, అందులో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపాదించిన 8,525 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికే 6,500కు పైగా కేంద్రాలు ప్రారంభమయ్యాయని మంత్రి వివరించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ఐకేపీ ఆధ్వర్యంలో 2,623 కేంద్రాలు, వివిధ సొసైటీల ద్వారా 3,278 కేంద్రాలు, ఇతర సహకార సంస్థల ద్వారా మరికొన్ని కేంద్రాలు పని చేస్తున్నాయి. అన్ని జిల్లాల్లో దాదాపు 43,000 మంది శిక్షణ పొందిన సిబ్బంది ఈ కొనుగోళ్లలో చురుగ్గా పాల్గొంటున్నారు. ఇప్పటివరకు మంగళవారం నాటికి సుమారు 8.50 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు పూర్తయిందని, సేకరించిన ధాన్యంలో దొడ్డు, సన్న రకాలుగా విభజించి సేకరణ కొనసాగిస్తున్నట్లు మంత్రి తెలిపారు. సేకరించిన ధాన్యాన్ని



వెంటవెంటనే మిల్లులకు తరలించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 6,500 లారీలను అందుబాటులో ఉంచగా, ఇప్పటికే 7 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం మిల్లులకు చేరింది. రైతులకు చెల్లింపుల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ఇప్పటివరకు రూ. 2,031 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించగా, ఇప్పటికే రూ. 323 కోట్ల నగదును నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆటోమేటెడ్ డ్రైయర్లు, క్లీనర్లు, మాయిశ్చర్ మీటర్లు మరియు టార్పాలిన్లను అందుబాటులో ఉంచారు. ధాన్యం నిల్వ కోసం ముందస్తుగా 20 కోట్ల గన్నీ సంచులను సిద్ధంగా ఉంచడం వల్ల కొనుగోళ్లు ఎక్కడా నిలిచిపోకుండా సాగుతున్నాయి. వరి ధాన్యంతో పాటు ఇతర పంటల కొనుగోళ్లు కూడా ఊపందుకున్నాయి. ఈ సీజన్‌లో 43.20 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న దిగుబడి అంచనాలు ఉండగా, ఇప్పటివరకు 3.46 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు జరిగాయి. దీని ద్వారా రూ. 830.69 కోట్ల విలువైన కొనుగోళ్లతో 64,779 మంది రైతులు లబ్ధి పొందారు. అలాగే 30,220 మెట్రిక్ టన్నుల శనగలు, 3,492 మెట్రిక్ టన్నుల పొద్దుతిరుగుడు పంట సేకరణ కూడా పూర్తయ్యింది. అన్ని జిల్లాల్లో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు పారదర్శకంగా జరిగేలా, రైతులకు తక్షణ చెల్లింపులు అందేలా ప్రభుత్వం పటిష్టమైన ఏర్పాట్లు చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# హైదరాబాద్‌లో హైనెకెన్ గ్లోబల్ సెంటర్

**ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు**

**ఐటీ, ఫైనాన్స్ రంగాల్లో వేలాది మందికి ఉపాధి..**

**76 వేల చదరపు అడుగుల్లో భారీ కార్యాలయం**

**హైదరాబాద్, ఏప్రిల్29:** ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బ్రూయింగ్ కంపెనీగా గుర్తింపు పొందిన హైనెకెన్, హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో 'హైనెకెన్ బిజినెస్ సర్వీసెస్ ఇండియా' పేరుతో తన ప్రతిష్టాత్మక కేంద్రాన్ని బుధవారం ప్రారంభించింది. దాదాపు 76 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు. ఈ కేంద్రం కేవలం కార్యాలయంగానే కాకుండా ఫైనాన్స్, డిజిటల్, టెక్నాలజీ మరియు అనలిటిక్స్ వంటి కీలక రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా సేవలను అందించే ఒక వ్యూహాత్మక కేంద్రంగా పనిచేయనుంది. ఈ కేంద్రం ఏర్పాటుతో రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడనున్నాయి. ప్రస్తుతం ఈ సంస్థలో సుమారు 300 మందికి పైగా నిపుణులకు ఉపాధి లభించగా, రాబోయే రోజుల్లో ఈ సంఖ్యను 1600కు పెంచాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచ బ్రూయింగ్ రంగంలో 150 ఏళ్లకు పైగా ఘనచరిత్ర కలిగిన హైనెకెన్ సంస్థకు ప్రపంచవ్యాప్తంగా 190కి పైగా దేశాల్లో మార్కెట్ ఉంది. ఇప్పటికే 70కి పైగా దేశాల్లో 165 కంటే ఎక్కువ బ్రూవరీలను కలిగి ఉన్న ఈ దిగ్గజ సంస్థ, హైదరాబాద్‌ను తన గ్లోబల్ సర్వీసెస్ కోసం ఎంచుకోవడం తెలంగాణ ఐటీ రంగం సాధించిన మరో విజయంగా భావిస్తున్నారు.





# పంచాయితీ అధికారులకు పదోన్నతులు

**తెలంగాణ సర్కార్ పచ్చజెండా**

**హైదరాబాద్, ఏప్రిల్ 29:** తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ అధికారుల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. గ్రామ పంచాయతీ అధికారుల పదోన్నతులకు తెలంగాణ సర్కార్ పచ్చ జెండా ఊపింది. జూనియర్ అసిస్టెంట్లు, జీపీవోలకు 60:40 నిష్పత్తిలో సీనియర్ అసిస్టెంట్ పోస్టులకు పదోన్నతులు కల్పించాలని నిర్ణయించింది. జిల్లా స్థాయిలో రొటేషన్ పద్ధతిలో ఈ పక్రియ సాగనుంది. ఈ కొత్త నిబంధనలు 2026 ఫిబ్రవరి 12 నుంచి అమలులోకి రానున్నాయి. దీనివల్ల వేలమంది అధికారులకు లబ్ధి చేకూరడమే కాకుండా, గ్రామాల్లో పాలన మరింత పటిష్టం కానుంది. అధికారులు వెంటనే ఈ పక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

# బెంగాల్‌లో రికార్డు స్థాయి పోలింగ్

- మమత మళ్లీ 'దీదీ' అనిపిస్తుందా?
- టీఎంసీ వర్సెస్ బీజేపీ..
- హోరాహోరీ పోరులో ఎగ్జిట్ పోల్స్ భిన్నాభిప్రాయాలు
- ముస్లిం ఓటర్లు, మహిళా సెంటిమెంట్ టీఎంసీకి బలం..
- బెంగాలీ పౌరుషం విజయం సాధిస్తుందా?

**కోల్‌కతా/న్యూఢిల్లీ:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో సరికొత్త చరిత్ర నమోదైంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాష్ట్రంలో అత్యధిక పోలింగ్ శాతం నమోదైన ఎన్నికలుగా ఇవి రికార్డుల్లోకెక్కాయి. పోలింగ్ బుధవారం ముగియడంతో అందరి దృష్టి ఇప్పుడు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలపై మళ్లింది. అయితే ఈ ఫలితాలు కూడా రాష్ట్రంలో అత్యంత ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి. కొన్ని సంస్థలు బీజేపీకి అధికారం దక్కుతుందని అంచనా వేయగా, మరికొన్ని సర్వేలు మమతా బెనర్జీ నాలుగోసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించడం ఖాయమని స్పష్టం చేస్తున్నాయి.

### సర్వేల విభిన్న అంచనాలు

ప్రముఖ సర్వే సంస్థ 'చాణక్య స్ట్రాటజీ' అంచనాల ప్రకారం.. బీజేపీ 150-160 స్థానాలతో మేజిక్ ఫిగర్‌ను దాటుతుందని, టీఎంసీ 130-140 స్థానాలకే పరిమితం కావచ్చని పేర్కొంది. అదేవిధంగా 'పీమార్క్' సర్వే కూడా బీజేపీకి 150-175 స్థానాలు దక్కుతాయని అంచనా వేసింది. అయితే, క్షేత్రస్థాయి విశ్లేషణలకు పెట్టింది పేరైన 'పీపుల్స్ పల్స్' మాత్రం బెంగాల్ ఓటరు మరోసారి మమత వైపే మొగ్గు చూపినట్లు వెల్లడించింది. ఈ సర్వే ప్రకారం టీఎంసీ 177-187 స్థానాలను కైవసం చేసుకుని బంపర్ మెజారిటీ సాధిస్తుందని, బీజేపీ 95-110 స్థానాలకే పరిమితం కావచ్చని తేలింది. టీఎంసీ కూటమికి 46.5 శాతం ఓట్లు లభిస్తాయని ఈ సంస్థ పేర్కొంది.

### టీఎంసీకి కలిసివచ్చిన అంశాలు

పీపుల్స్ పల్స్ సర్వే ప్రకారం, రాష్ట్రంలోని 35 శాతానికి పైగా ఉన్న ముస్లిం ఓటర్లు బీజేపీని వ్యతిరేకిస్తూ మూకుమ్మడిగా టీఎంసీ వైపు నిలిచారు. ముఖ్యంగా 112 స్థానాల్లో ముస్లిం ఓటర్లు కీలకంగా మారారు. దీంతో పాటు టీఎంసీ ప్రవేశపెట్టిన 'లక్కీ భండార్' పథకం మహిళలను మమతా బెనర్జీ వైపు మళ్లించడంలో విజయవంతమైంది. బీజేపీ ప్రయోగించిన జాతీయవాదం కంటే దీదీ పండించిన 'బెంగాలీ సెంటిమెంట్' ప్రజల్లోకి బలంగా వెళ్లిందని విశ్లేషకులు భావిస్తున్నారు. దళితులు, ముస్లింలు టీఎంసీకి అండగా నిలవగా, ఓబీసీ ఓట్లు మాత్రం ఇరు పార్టీల మధ్య చీలిపోయాయి.

### బీజేపీకి ప్రతికూలమైన 'సర్' అంశం

'సర్' ద్వారా సుమారు 90 లక్షల ఓట్లు తొలగించడం బీజేపీకి భారీ ప్రతికూలతగా మారింది. తమ పౌరహక్కులు,




రేషన్ కార్డులు పోతాయన్న భయం ఓటర్లలో నెలకొనడం వల్ల మాతూస్ సామాజిక వర్గం కూడా బీజేపీకి దూరమైనట్లు సర్వేలో వెల్లడైంది. క్షేత్రస్థాయిలో బీజేపీకి బలమైన కార్యకర్తల యంత్రాంగం లేకపోవడం, మమతకు సరితూగే రాష్ట్ర స్థాయి నాయకుడు ఎవరూ లేకపోవడం కూడా ఆ పార్టీకి మైనస్ అయ్యింది. గతంలో కాంగ్రెస్‌కు 25 ఏళ్లు, కమ్యూనిస్టులకు 35 ఏళ్ల పాటు అధికారం కట్టబెట్టిన బెంగాల్ ప్రజల ఓర్పు, సహనాన్ని బట్టి చూస్తే, ఈసారి కూడా టీఎంసీకి నాలుగోసారి పట్టం కట్టే అవకాశాలే మెండుగా కనిపిస్తున్నాయి. ఏదేమైనా, ఈ ఎగ్జిట్ పోల్స్ ప్రాథమిక అంచనాలు మాత్రమేనని, అసలు ఫలితాలు మే 4న ఈసీ ప్రకటించే వరకు ఉత్కంఠ కొనసాగుతుందని రాజకీయ నిపుణులు పేర్కొంటున్నారు.

# అధికారం రావడం.. పోవడం రొటీన్



- హామీలు గుప్పించి.. ప్రజలను మోసం చేస్తున్న రేవంత్
- కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగం అవుతామని కేసీఆర్ ఆనాడే హెచ్చరించారు
- రేవంత్‌తో నాకేమీ వ్యక్తిగత పంచాయితీ లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, ఏప్రిల్ 29:** అధికారం రావడం పోవడం రొటీన్‌గా జరిగే తంతు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. నాయకులు, ప్రభుత్వాలు మారుతుంటాయి. ప్రజల స్థితిగతులు మారుతున్నాయా లేదా అని ఆలోచించడం లేదని తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన జాయినింగ్ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. అధికారం తమకు కొత్తేం కాదని వెల్లడించారు. మొన్ననే తమ పార్టీ ఏర్పడి 25 ఏళ్లు పూర్తిచేసుకుందని గుర్తు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో తెలుగుదేశం పార్టీతోపాటు బీఆర్ఎస్ మాత్రమే నిలబడ్డాయని చెప్పారు. అధికారంలోకి రాకుంటే కొంపలు అంటుకుపోతాయి అనుకోవద్దని నేతలకు సూచించారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ చిలుకకు చెప్పినట్టు చెప్పారని.. తొందరపడకండి ఆగమై ఓటు వేయకండి అని కేసీఆర్ కల్వకుర్తిలో చెప్పిన మాటలను గుర్తు చేశారు. కేసీఆర్ రైతుబంధు ఇచ్చే సమయంలో ఆయన ఇంట్లో నుంచి ఇస్తున్నారా? అని ప్రశ్నించారు.. పెద్ద రైతులకు ఎందుకు ఇస్తున్నారు అంటూ అడిగారన్నారు. ఎన్ని విమర్శలు వచ్చినా రైతుబంధు మాత్రం కేసీఆర్ ఆపకుండా ఇచ్చేవారని తెలిపారు. ఇప్పుడు పరిస్థితి ఎలా ఉందో చూడాలని ప్రజలకు సూచించారు. చాలా నియోజక వర్గాల్లో కేసీఆర్ గెలిస్తే చాలు ఈ ఎమ్మెల్యే మాకొద్దు అనుకుని తమ ఎమ్మెల్యేలను ఓడగొట్టారని కేటీఆర్ అన్నారు. అలా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఓడగొట్టడం వల్లే కేసీఆర్ సీఎం కాలేకపోయారని తెలిపారు. తర్వాత మనకు చాలా షాక్‌లు తగిలాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. ఆ తర్వాత కేసీఆర్‌కి రెండోసారి ఫ్రాక్చర్ జరిగింది. మన పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ మారి వెళ్లిపోయారు. ఇక రేవంత్ రెడ్డి మీద నాకు గెట్టు పంచాయతీ లేదు. ఇంకా వేరే గొడవ ఏమీ లేదు. కానీ ఇష్టం వచ్చినట్లు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన వాళ్లు జనాలను మోసం చేశారు. అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోతుందని కేసీఆర్ చెప్పారు. కానీ మనం వినలేదు. ఎన్నికల ముందు కల్వకుర్తిలో సర్వే చేయించాం. మన ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఓడిపోతాడని క్లియర్‌గా చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉన్నారు కాబట్టి అధికార మార్పిడి కావాలని చాలా మంది జనాలు భావించారని కేటీఆర్ వివరించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఓడగొట్టడం వల్లే కేసీఆర్ సీఎం కాలేకపోయారని కేటీఆర్ వెల్లడించారు.

# దేశంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్‌దే విజయం

**దేశంలో బీజేపీ కులమతాల పిచ్చి రేపుతోంది**

**పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్**




**నిజామాబాద్, ఏప్రిల్ 29:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేతుల మీదుగా నిజామాబాద్ జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. బుధవారం ఉదయం నిజామాబాద్‌లో నూతన కాంగ్రెస్ కార్యాలయ భవనానికి మహేశ్ గౌడ్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రధాని పదవిని కూడా రాహుల్ గాంధీ త్యాగం చేశారని.. దేశం మొత్తం ఆయనవైపు చూస్తోందన్నారు. దేశంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ.. కుల, మతాల చిచ్చు రేపుతోందని మహేశ్ విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వంద సీట్లు రావటం ఖాయమన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని తెలిపారు. కేసీఆర్ పాలన తెలంగాణను 50 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లిందని మహేశ్ విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మరో పార్టీ పోటీ లేదన్నారు. మంచి నమూనాతో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా వెనక్కి తగ్గేది లేదని మహేశ్ కుమార్ స్పష్టం చేశారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ ఎంతో అభివృద్ధి చేసిందని.. ఏడాది కాలంలో 4 లక్షల ఇండ్లు కట్టించి ఇచ్చామని మంత్రి సీతక్క వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే భూపతి రెడ్డి పాల్గొన్నారు.

# పోలీస్ యూనిఫామ్‌లో రీల్స్

**దొంగ పోలీస్ రవిని అరెస్ట్ చేసిన పోలీసులు**

**ఒంగోలుకు చెందిన వ్యక్తిగా గుర్తింపు**



**హైదరాబాద్, ఏప్రిల్ 29:** పోలీస్ యూనిఫాంలో సెక్యూరిటీ కళ్లు గప్పి తెలంగాణ సచివాలయం లో రీల్స్ చేసి అందరినీ గందరగోళపర్చిన సుడో పోలీస్‌ను ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. నిందితుడు ఏపీలోని ఒంగోలుకు చెందిన రవి అలియాస్ నిఖిల్ యాదవ్‌గా గుర్తించిన సైఫాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొద్ది రోజుల క్రితం ఫ్యామిలీతో హైదరాబాద్ కు వచ్చిన రవి.. సచివాలయంలో సెక్యూరిటీగా డ్యూటీ చేస్తున్నాను..సీఎం రేవంత్ రెడ్డిని కలవాలంటే నాకు ఫోన్ చేయండి అంటూ సోషల్ మీడియాలో ఓ వీడియోను షేర్ చేశాడు. నెట్టింట వీడియో వైరల్ కావడంతో పెద్ద దుమారం రేగింది. ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు. పోలీసుల విచారణలో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. అతను సచివాలయంలో సెక్యూరిటీ కాదని .. ఓ సాధారణ వ్యక్తి అని.. కేవలం రీల్స్ చేసి వైరల్ అవడం కోసం ఇలా చేశాడని పోలీసులు గుర్తించారు. ఆ రీల్స్ చేసింది ఒంగోలు రవి అలియాస్ నిఖిల్ యాదవ్ గా గుర్తించారు. ఫ్యామిలీ తో కలిసి సచివాలయంలో ఫొటోలు దిగుతామని సెక్యూరిటీని బతిమలాడి లోనికి వెళ్లినట్లు గుర్తించారు. తర్వాత సచివాలయం ప్రాంగణంలో రీల్స్ చేసి సోషల్ మీడియా ఎ÷-లాట్ ఫాం ఇన్ స్టాలో పోస్ట్ చేశాడు. రవి చేసిన ఈ వీడియో నెట్టింట వైరల్ కావడంతో పోలీసులు షాక్ తిన్నారు. రవికోసం ఆరా తీసిన పోలీసులు అతని అడ్రసు, వివరాలు సేకరించారు. చివరికి అతన్ని పట్టుకున్నారు. అప్పటికే రవిపై చీటింగ్ కేసుతోపాటు ఐటీ ఆక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు. బుధవారం రవి అలియాస్ నిఖిల్ యాదవ్ ను అరెస్ట్ చేశారు.

# జైళ్ల శాఖ పాత్ర సమాజంలో అత్యంత కీలకం

**ఖైదీలను సంస్కరించి తిరిగి సమాజంలో కలిపే ప్రధాన బాధ్యత సిబ్బందిదే**

**డీజీపీ శివధర్ రెడ్డి**

**చంచల్‌గూడ 'సికా'లో ఢిల్లీ జైలు సిబ్బంది శిక్షణ ప్రారంభం**

**9 నెలల పాటు 381 మందికి దశలవారీగా ట్రైనింగ్**




**హైదరాబాద్, ఏప్రిల్29:** సమాజంలో జైళ్ల శాఖ నిర్వహిస్తున్న పాత్ర అత్యంత కీలకమని, ఇది కేవలం నాలుగు గోడల మధ్య తాళాలు వేసే పని కాదని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. ఖైదీలను సరిదిద్దుతూ వారిని తిరిగి సమాజంలో కలిపే బాధ్యత సిబ్బందిపై ఉందని, ఇది ఎంతో బాధ్యతతో కూడిన పని అని ఆయన అభిప్రాయపడ్డారు. బుధవారం చంచల్‌గూడలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ (సికా)లో ఢిల్లీ జైళ్ల సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన ప్రవేశ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శిక్షణార్థులు క్రమశిక్షణ, నిష్పక్షపాత వైఖరి మరియు వృత్తిపరమైన నైపుణ్యాలను పాటిస్తూ ఖైదీలను మానవత్వంతో చూడాలని సూచించారు. రాష్ట్రాల మధ్య సమన్వయం మరియు సంస్కరణల పరిపాలనలో పరస్పర సహకారానికి ఈ శిక్షణ కార్యక్రమం ఒక ప్రతీకగా నిలుస్తోందని డీజీపీ తెలిపారు. 2026 సంవత్సరంలో మొత్తం 381 మంది ఢిల్లీ జైళ్ల సిబ్బంది దశలవారీగా ఇక్కడ శిక్షణ పొందనుండగా, నేడు ప్రారంభమైన మొదటి దశలో 61 మంది ఢిల్లీ సిబ్బందితో పాటు ఒకరు తెలంగాణ జైళ్ల వార్డర్ పాల్గొంటున్నారు. తొమ్మిది నెలల పాటు సాగే ఈ సమగ్ర శిక్షణలో క్రిమినాలజీ, సైకాలజీ, చట్టాలు మరియు జైలు పరిపాలనలో సాంకేతికత వంటి అంశాలతో పాటు శారీరక వ్యాయామం, యోగా మరియు పరేడ్ వంటి బాహ్య అంశాలపై కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సౌమ్య మిశ్రా మాట్లాడుతూ, సికా సంస్థపై ఉన్న నమ్మకంతో ఇంత పెద్ద సంఖ్యలో సిబ్బందిని శిక్షణకు పంపడం గర్వకారణమని పేర్కొన్నారు. శిక్షణార్థులు సికాలోని అత్యాధునిక తరగతి గదులు, ఆడిటోరియం, గ్రంథాలయం, ఇతర వసతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇదే సందర్భంలో జైళ్ల శాఖ అధికారులు, సిబ్బంది డీజీపీ శివధర్ రెడ్డి 60వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి, ఆయన సేవలను స్మరించుకున్నారు.



# మోడీ సభ పోస్టర్ ఆవిష్కరణ

**హైదరాబాద్, ఏప్రిల్ 29:** మే 10న పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న ప్రధాని మోదీ బహిరంగ సభకు 'జనాగ్రహ సభ'గా నామకరణం చేసినట్లు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు వెల్లడించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో దీనికి సంబంధించిన పోస్టర్‌ను పార్టీ నేతలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం ప్రధాని మోదీ తొలిసారి హైదరాబాద్‌కు వస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ.7 వేల కోట్లకుపైగా నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. తెలంగాణ అభివృద్ధి జరగాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని ప్రజలు భావిస్తున్నారు. మహిళా రిజర్వేషన్లను కాంగ్రెస్ అడ్డుకుంది. ఉత్తరాది, దక్షిణాది పేరుతో విభజన రాజకీయాలు చేస్తోందని రామచందర్‌రావు వ్యాఖ్యానించారు.

# పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత లేదు

**కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**



**హైదరాబాద్, ఏప్రిల్ 29:** రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత ఏమాత్రం లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. పెట్రోల్ డీజిల్ కొరతపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. కొందరు పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. సోషల్ మీడియా ఇన్ ఫ్లూ యెన్సర్లు విషయం తెలుసుకోకుండా తప్పుడు ప్రచారం చేయొద్దన్నారు. నేతలు, సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మి ప్రజలు గందరగోళంలో పడొద్దన్నారు. తొందరపడి పెట్రోల్,డీజిల్ ను ఇండ్లలో నిల్వ ఉంచుకోవద్దన్నారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి. రాష్ట్రంలో ప్రజల అవసరాలకు కావాల్సినంత స్టాక్ ఉందన్నారుకేంద్ర మంత్రి కిషన్ రెడ్డి. తెలంగాణలో రోజుకు 6వేల 400 కిలో లీటర్ల పెట్రోల్ అవసరం ఉండగా.. ఈ రోజు 10వేల 300 కిల లీటర్ల పెట్రోల్ సప్లయ్ జరిగిందన్నారు. డీజిల్ 8వేల కిలో లీటర్ల అవసరం ఉండగా..19వేల 300 కిలో లీటర్ల సప్లయ్ చేశామన్నారు. అమెరికా , ఇరాన్ యుద్ధం కారణంగా పెట్రోల్ డీజిల్ దిగుమతిలో కొంత సమస్య ఏర్పడింది వాస్తవమే.. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో దేశంలోగానీ, రాష్ట్రంలో గానీ పెట్రోల్ డీజిల్ కొరత లేదన్నారు. 88 శాతం చమురు ఉత్పత్తులను ప్రపంచ దేశాలనుంచి దిగుమతి చేసుకుంటున్నాం..మనకు కావాల్సినంత స్టాక్ ఉందన్నారు కిషన్ రెడ్డి. ఒకవేళ స్టాక్ లేకపోతే పజలకు చెప్తాం.. కావాలనే ప్రతిపక్ష నేతల రేట్లు పెరుగుతాయనిప్రచారం చేస్తున్నారు వారిమాటల నమ్మొద్దన్నారు. రాహుల్ గాంధీ లాంటి ప్రతి పక్ష నేతలు రాజకీయ నేతలు చేస్తున్న పానిక్ కామెంట్లతో ప్రజలు గందరగోళానికి గురవతున్నారు. పెట్రోల్, డీజిల్ ను ఇండ్లలో స్టాక్ పెట్టుకుంటున్నారు.. అసలే ఎండాకాలం ఇది మంచిది కాదని కిషన్ రెడ్డి ప్రజలకు సూచించారు.

# విద్యార్థులకు శుభవార్త

**స్కాలర్‌షిప్ బకాయిల విడుదలపై డిప్యూటీ సీఎం భట్టి కీలక నిర్ణయం**

**పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే క్లియర్ చేయాలని ఆదేశం**

**హైదరాబాద్, ఏప్రిల్29:** రాష్ట్రంలోని పేద విద్యార్థులు ఎదుర్కొంటున్న స్కాలర్‌షిప్ నిధుల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బుధవారం ప్రజాభవన్‌లో విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. గత కొంతకాలంగా సాంకేతిక కారణాలు లేదా నిధుల కొరత వల్ల ఆగిపోయిన స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే క్లియర్ చేసేందుకు ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతోంది. విద్యార్థుల చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డుకాకూడదన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని, అందుకే స్కాలర్‌షిప్ విషయంలో సానుకూలంగా నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, అర్హులైన ప్రతి విద్యార్థికి సకాలంలో నిధులు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యతని, నిధుల విడుదల ప్రక్రియను వేగవంతం చేసి వారికి పూర్తి భరోసా కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు పెండింగ్ దరఖాస్తుల వివరాలను డిప్యూటీ సీఎంకు వివరించగా, ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్న విద్యార్థులకు పెద్ద ఉపశమనం కలగనుంది.

# సీఎంతో నూతన డీజీపీ భేటీ

**తనకు కీలక బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు**

**హైదరాబాద్, ఏప్రిల్29:** తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా నియమితులైన సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ బుధవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ లో జరిగిన ఈ భేటీలో, రాష్ట్ర శాంతిభద్రతల పరిరక్షణలో తనపై నమ్మకం ఉంచి డీజీపీగా బాధ్యతలు అప్పగించినందుకు ముఖ్యమంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్‌కు శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా విధులు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్రంలో నేరాల నియంత్రణ, డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యం, పోలీస్ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేసే అంశాలపై సీఎం పలు కీలక సూచనలు చేసినట్లు సమాచారం. ప్రస్తుత డీజీపీ బి. శివధర్ రెడ్డి ఏప్రిల్ 30న పదవీ విరమణ పొందనుండగా, మే 1వ తేదీన సీవీ ఆనంద్ నూతన డీజీపీగా అధికారికంగా బాధ్యతలు స్వీకరించనున్నారు.





సంపాదకీయం

# యుగాల చీకటిని చీల్చిన విప్లవ సూర్యుడు!

## అక్షర విప్లవశంఖం శ్రీశ్రీ

### సామాన్యుడి గొంతుకగా మారిన మహాకవి!

### సాంప్రదాయ ఛందస్సు ధిక్కారం..

### అభ్యుదయ సాహిత్యానికి 'మహాప్రస్థానం'

### 'శ్రమైక జీవన సౌందర్యం' చాటిన విప్లవ యోధుడు..

### నేటికీ స్ఫూర్తిదాయకం ఆ కలం

**కవిత్వం అంటే కేవలం పదాల పొందిక కాదు, అది ఒక సామాజిక బాధ్యత అని చాటిచెప్పిన యుగకర్త శ్రీరంగం శ్రీనివాసరావు. సమాజ రుగ్మతలను ప్రశ్నిస్తూ, ప్రజలను చైతన్యపరచడమే కవి అసలైన ధర్మమని నమ్మిన ఆయన, తన రచనల ద్వారా సామాజిక హితం కోసం నిరంతరం శ్రమించారు. కాలం మారుతున్నా, పాలకులు మారుతున్నా నేటికీ సమాజంలో నెలకొన్న అవినీతి, నిరుద్యోగం వంటి సమస్యలను దశాబ్దాల క్రితమే తన 'పాడవోయి భారతీయుడా' వంటి గీతాల ద్వారా ఎండగట్టిన ద్రష్ట ఆయన. శ్రీశ్రీగా అందరి ప్రీతిపాత్రమైన ఈ మహాకవి జయంతి సందర్భంగా, తెలుగు సాహిత్యానికి ఆయన చూపిన కొత్త దిశను స్మరించుకోవడం మన కర్తవ్యం.**

#### విప్లవాత్మక మార్పులకు నాంది




1910 ఏప్రిల్ 30న విశాఖపట్నంలో జన్మించిన శ్రీశ్రీ, తెలుగు కవిత్వంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికారు. సాంప్రదాయ ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించి, సామాన్యుడి భాషలో అభ్యుదయ కవిత్వానికి బాటలు వేశారు. ఆయన కలం నుంచి జాలువారిన 'మహాప్రస్థానం' (1950) తెలుగు సాహిత్య చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచింది. "మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచింది" అంటూ ఆయన ఇచ్చిన పిలుపు కార్మిక, కర్షక వర్గాల్లో నూతనోత్తేజాన్ని నింపింది. ఆధునిక తెలుగు సాహిత్యాన్ని 'మహాప్రస్థానానికి ముందు.. ఆ తర్వాత' అని విభజించేంతలా ఆ రచన ప్రభావితం చేసింది.

#### వెండితెరపై జాతీయ గౌరవం

కేవలం అభ్యుదయ కవిగానే కాకుండా, తెలుగు సినిమా పాటల రచయితగా కూడా శ్రీశ్రీ తనదైన ముద్ర వేశారు. 'అల్లూరి సీతారామరాజు' చిత్రంలో ఆయన రాసిన "తెలుగు వీర లేవరా" గీతం తెలుగు సినిమా పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిపెట్టింది. ప్రాస, శ్లేష మరియు అల్పాక్షరాల్లో అనల్పార్థాన్ని సృష్టించడంలో ఆయన మేటి. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షుడిగా సామాజిక మార్పు కోసం నిరంతరం కృషి చేసిన హేతువాది ఆయన. రాజదర్బారుల్లో వెలుగొందిన సాహిత్యాన్ని సామాన్యుడి గుడిసె వరకు తీసుకెళ్లిన ఘనత శ్రీశ్రీదే.

#### శ్రమజీవికి అంకితమైన అక్షరం



"శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనే లేదు" అని చాటిచెప్పిన శ్రీశ్రీ, కాయకష్టం చేసే శ్రామికుడి చెమట చుక్కలో ప్రపంచాన్ని చూశారు. కుల మతాల చట్రంలో ఇరుక్కుపోయిన సమాజానికి ఆయన అక్షరాలు శస్త్రచికిత్సలా పనిచేశాయి. సోమరితనాన్ని నిరసిస్తూ యువతను ఉత్తేజపరచడంలో ఆయన శైలి అనన్యం. "నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను" అని ప్రకటించిన ఆ మహనీయుడు, సామాన్యుడికి ఆత్మగౌరవాన్ని ప్రసాదించారు. సాహిత్య లోకంలో ఎన్నో మార్పులు రావచ్చు కానీ, శ్రీశ్రీ సృష్టించిన అభ్యుదయ భావజాలం అనే సంతకాన్ని కాలం ఎప్పటికీ చెరిపివేయలేదు.

# మే 4న ఐదు రాష్ట్రాల్లో గెలిచి హ్యాట్రిక్ సాధిస్తాం

- బెంగాల్‌లో భయరహితంగా పోలింగ్..
- ప్రజాస్వామ్య పటిష్టతకు ఇది నిదర్శనం
- విపక్షాల కోటలు బద్దలు కావడం ఖాయం
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- హర్దోయిలో 'గంగా ఎక్స్‌ప్రెస్‌వే' ప్రారంభం

**హర్దోయి/న్యూఢిల్లీ:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సరళి, రాబోయే ఫలితాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గెలుపు ధీమాను వ్యక్తం చేశారు. మే 4వ తేదీన వెలువడనున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ఘనవిజయం సాధించి 'హ్యాట్రిక్' నమోదు చేయడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. బుధవారం ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన 'గంగా ఎక్స్‌ప్రెస్‌వే'ను ప్రారంభించిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలు, గుజరాత్ మున్సిపల్ ఎన్నికల్లో సాధించిన విజయాల పరంపర ఐదు రాష్ట్రాల్లోనూ కొనసాగుతుందని, ఈ విజయంతో 'వికసిత భారత్' సంకల్పానికి మరింత బలం చేకూరుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



#### భయరహితంగా బెంగాల్ ఓటరు

బెంగాల్‌లో ప్రస్తుతం జరుగుతున్న రెండో విడత పోలింగ్‌ను ప్రస్తావిస్తూ, గత ఆరేడు దశాబ్దాల్లో ఎన్నడూ లేని విధంగా అక్కడ ప్రజలు భయరహిత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్నారని ప్రధాని ప్రశంసించారు. "గతంలో ఎన్నికలంటే భయం, హింస ఉండేవి.. కానీ ఇప్పుడు బెంగాల్ ఓటరు స్వేచ్ఛగా పోలింగ్ కేంద్రాలకు తరలివస్తున్నారు. సోషల్ మీడియాలో కనిపిస్తున్న భారీ క్యూలైన్లే ఇందుకు సాక్ష్యం. ప్రజాస్వామ్య పటిష్టతకు ఇది శుభసూచకం" అని మోదీ పేర్కొన్నారు. మొదటి విడతలో మాదిరిగానే రెండో విడతలోనూ భారీగా పోలింగ్ శాతం నమోదవుతుండటం మార్పుకు సంకేతమని ఆయన విశ్లేషించారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే రాష్ట్రాల అభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని, అందుకే బీజేపీకి బ్రహ్మరథం పడుతున్నారని ప్రధాని అన్నారు. హర్దోయిలో ప్రారంభించిన గంగా ఎక్స్‌ప్రెస్‌వే ఈ ప్రాంత దశదిశను మారుస్తుందని, మౌలిక సదుపాయాల కల్పనే తమ ప్రభుత్వ ప్రాధాన్యతని వివరించారు. మే 4న వెలువడే ఫలితాలు దేశ రాజకీయాల్లో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తాయని, విపక్షాల తప్పుడు ప్రచారాలను తిప్పికొడుతూ ప్రజలు అభివృద్ధి వైపు నిలబడతారని మోదీ ధీమా వ్యక్తం చేశారు. పోలింగ్ ముగిసే వరకు ఓటర్లందరూ ఉత్సాహంగా పాల్గొని ప్రజాస్వామ్య పండుగను జయప్రదం చేయాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# మేమే లేకపోతే మీరు ఫ్రెంచ్ మాట్లాడిల్సి వచ్చేది..

#### ట్రంప్‌కు బ్రిటన్ రాజు ఛార్లెస్ చురకలు

**వాషింగ్టన్, ఏప్రిల్ 29:** బ్రిటిష్ వారు లేకపోతే అమెరికా ప్రజలు ఫ్రెంచ్ మాట్లాడాల్సి వచ్చేదంటూ బ్రిటన్ రాజు ఛార్లెస్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఎద్దేవా చేస్తూ చురకలు అంటించారు. మంగళవారం రాత్రి అధ్యక్ష కార్యాలయంలో జరిగిన స్టేట్ డిన్నర్‌లో ఆయన సరదాగా మాట్లాడుతూ.. రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా సహాయం చేయకపోతే యూరోపియన్ దేశాల ప్రజలు జర్మన్, జపనీస్ మాట్లాడేవారని ట్రంప్ గతంలో అన్న మాటలను బ్రిటన్ రాజు గుర్తుచేశారు. 'అధ్యక్షా.. అమెరికా లేకపోతే యూరోపియన్ దేశాలు జర్మన్ మాట్లాడేవని మీరు ఇటీవల వ్యాఖ్యానించారు. నేనేం చెబుతున్నానంటే ఒకవేళ మేము లేకపోతే, మీరు ఫ్రెంచ్ మాట్లాడేవారు' అని ఛార్లెస్ చమత్కరించారు. 250 ఏళ్ల క్రితం అమెరికాకు స్వాతంత్ర్యం రాకముందు.. ఈ దేశంపై పట్టు కోసం బ్రిటన్, ఫ్రాన్స్ చేసిన ప్రయత్నం గురించి ఆయన ప్రస్తావించారు. లండన్-వాషింగ్టన్ మధ్య ఉన్న ప్రత్యేక సంబంధాన్ని కొనియాడారు. అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. స్టేట్ డిన్నర్‌లో



అద్భుతమైన ప్రసంగం చేసినందుకు బ్రిటన్ రాజును అభినందించారు. ఇరాన్‌తో యుద్ధం విషయంలో తమకు మద్దతిచ్చేందుకు ఆ దేశ ప్రధాని కీర్ స్టార్మర్ ముందుకు రాకపోవడాన్ని విమర్శించారు.

## NO MORE MR. NICE GUY!



# ఇకమీదట మంచోడిగా ఉండను

#### ఫొటో పెట్టి మరీ ట్రంప్ వార్నింగ్

**వాషింగ్టన్ :** ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరికలు చేశారు. అణు కార్యక్రమానికి సంబంధించి దౌత్యపరమైన పరిష్కారం త్వరలో లభించకుంటే అమెరికా కఠిన వైఖరి తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఇరాన్ తెలివిగా వ్యవహరిస్తే మంచిదన్నారు. ఈ మేరకు రైఫిల్ పట్టుకున్న ఫొటోను 'ట్రూత్ సోషల్'లో పోస్టు చేసిన ట్రంప్.. ఇక మీదట తాను మంచివాడిగా ఉండనని పేర్కొన్నారు. "చర్చల విషయంలో ఇరాన్ సరిగ్గా వ్యవహరించలేకపోతోంది. అణు ఒప్పందం ఎలా చేసుకోవాలో వారికి తెలియడం లేదు. వారు తెలివిగా వ్యవహరిస్తే మంచిది. 'ఇక మీదట అంత మంచివాడిగా ఉండను' అని ట్రంప్ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడం, అమెరికా-ఇరాన్‌ల మధ్య దౌత్యపరమైన ప్రతిష్టంభన నెలకొన్న వేళ ట్రంప్ నుంచి ఈ ప్రకటన వెలువడింది. అంతేకాదు, అమెరికా ప్రతిపాదనలు తిరస్కరిస్తే తాము మరింత దూకుడుగా, కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరికలు చేస్తున్నారు.

# హైకోర్టు వర్చువల్ విచారణలో కలకలం

- ఏకంగా చీఫ్ జస్టిస్ బెంచ్ ముందే అశ్లీల వీడియోల ప్రదర్శన!
- మూడుసార్లు అంతరాయం కలిగించిన ఆగంతకుడు..
- 'మీరు హ్యాక్ చేయబడ్డారు' అంటూ వాయిస్ మెసేజ్
- తీవ్రంగా పరిగణించిన న్యాయస్థానం..
- నిందితుడి కోసం సైబర్ క్రైమ్ గాలింపు

**న్యూఢిల్లీ:** న్యాయవ్యవస్థలో పారదర్శకత కోసం ప్రవేశపెట్టిన సాంకేతికత దుర్వినియోగం అవుతున్న తీరుకు ఢిల్లీ హైకోర్టులో బుధవారం చోటుచేసుకున్న ఘటనే నిదర్శనం. చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని బెంచ్ ముందు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ జరుగుతుండగా, ఒక ఆగంతకుడు అశ్లీల వీడియోను ప్లే చేసి కోర్టు కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగించాడు. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్




తేజాస్ కారియాలతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఉదయం సప్లిమెంటరీ లిస్ట్‌లోని కేసులను విచారిస్తున్న సమయంలో ఈ వికృత ఘటన వెలుగు చూసింది.

#### మూడుసార్లు ప్రదర్శన

వర్చువల్ మీటింగ్‌లోకి 'Shitjeet Sighn' అనే పేరుతో ప్రవేశించిన వ్యక్తి, సడన్‌గా అశ్లీల కంటెంట్‌ను స్క్రీన్ షేర్ చేశాడు. దీంతో షాక్‌కు గురైన కోర్టు సిబ్బంది వెంటనే లింక్‌ను నిలిపివేశారు. పరిస్థితి చక్కబడిందని భావించి కొంత సమయం తర్వాత విచారణను తిరిగి ప్రారంభించగా, అదే వ్యక్తి మళ్లీ ప్రవేశించి రెండోసారి, ఆపై మూడోసారి కూడా అశ్లీల దృశ్యాలను ప్రదర్శించడంతో కోర్టు హాల్‌లో గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో బ్యాక్‌గ్రౌండ్‌లో ఒక స్వరం వినిపిస్తూ.. "ఇది అమెరికా నుండి జరుగుతున్న హ్యాకింగ్. వెంటనే మీటింగ్‌ను ఆపేయండి, మీరు హ్యాక్ చేయబడ్డారు" అని హెచ్చరించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పట్టింది.

#### సైబర్ క్రైమ్ దర్యాప్తునకు ఆదేశం

ఈ అవాంతరాలను తీవ్రంగా పరిగణించిన చీఫ్ జస్టిస్, వర్చువల్ విచారణలను తక్షణమే నిలిపివేశారు. న్యాయవ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రవర్తించిన సదరు వ్యక్తిని గుర్తించేందుకు సైబర్ క్రైమ్ విభాగం రంగంలోకి దిగింది. గతంలో సుప్రీంకోర్టు, ఇతర హైకోర్టుల విచారణల్లోనూ ఇలాంటి ఘటనలు ఎదురైనప్పటికీ, ఏకంగా డివిజన్ బెంచ్ ముందే మూడుసార్లు అంతరాయం కలిగించడంపై న్యాయవాదులు, అధికారులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోర్టు అధికారులను ఆదేశించింది.

# సోనమ్‌కు బెయిల్‌పై సవాల్

### మేఘాలయ హైకోర్టులో సవాల్ చేయాలని నిర్ణయం

**భోపాల్, ఏప్రిల్ 29:** సంచలనం సృష్టించిన మేఘాలయ హనీమూన్ హత్య కేసులో నిందితురాలు సోనమ్‌కి బెయిల్ ఇవ్వడంపై సవాల్ చేయాలని రఘువంశీ కుటుంబం నిర్ణయించింది. సోనమ్‌కు బెయిల్ రావడంపై రాజా రఘువంశీ కుటుంబం ఆశ్చర్యపోయింది. దీనిపై మేఘాలయ హైకోర్టును ఆశ్రయించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సోనమ్ అరెస్టు సమయంలో పోలీసులు చేసిన తప్పిదం వల్లే ఆమెకు బెయిల్ మంజూరైనట్లు తాజాగా బయటకొచ్చింది. దీనిపై బాధిత రఘువంశీ కుటుంబం మేఘాలయ హైకోర్టును ఆశ్రయించేందుకు సన్నద్ధమవుతుంది. భారతీయ న్యాయ సంహిత ప్రకారం.. హత్యకు సంబంధించి నిందితులపై 103(1) సెక్షన్ విధించాలి. కానీ ఈ హనీమూన్ హత్య కేసుకు సంబంధించి సోనమ్ అరెస్టు మెమోలో సెక్షన్ 403(1) అని ప్రస్తావించారు. బీఎన్ఎస్‌లో ఇలాంటి సెక్షనే లేదు. సాంకేతిక తప్పిదం వల్ల ఇలా జరిగిందని పోలీసులు పేర్కొన్నారు. అయితే, అరెస్టు మెమోలోనే కాకుండా.. కేసుకు సంబంధించిన అన్ని పత్రాల్లోనూ ఇదే సెక్షన్ ప్రస్తావించ డాన్ని మేఘాలయ కోర్టు గుర్తించింది. సాంకేతిక తప్పిదమనే పోలీసుల వాదనలను తిరస్కరించింది. ఈ క్రమంలో సోనమ్



అరెస్టుకి సరైన కారణాలు లేవని పేర్కొంది. దీంతోపాటు సోనమ్‌ను అరెస్టు చేసి తొలిసారి గాజీపుర్‌లోని కోర్టులో హాజరుపరిచినప్పుడు.. న్యాయవాదిని కలిసేందుకు ఆమెకు అనుమతులు ఇచ్చినట్లు రికార్డుల్లో ఎక్కడా లేదని కోర్టు పేర్కొంది. దీని కారణంగా ఆమె మొదట్లోనే తన అరెస్టును సవాల్ చేయలేక పోయిందని గుర్తించింది. ఈ లోపాల వల్ల సోనమ్‌కు బెయిల్ మంజూరుచేస్తున్నట్లు న్యాయస్థానం తీర్పునిచ్చింది. అయితే, అనుమతులు లేకుండా సోనమ్ షిల్లాంగ్ జిల్లాను విడిచివెళ్లకూడదన్న షరతు విధించింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన రాజా రఘువంశీ కుటుంబం ట్రాన్స్‌పోర్టు వ్యాపారం చేస్తోంది. గతేడాది మే 11న అతడికి సోనమ్ తో వివాహం జరగ్గా.. 20న హనీమూన్ కోసం ఈ నవ దంపతులు మేఘాలయకు వెళ్లారు. ఆ తర్వాత వీరు కన్పించకుండాపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురై పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలోనే అదృశ్యమైన 11 రోజుల తర్వాత రాజా రఘువంశీ మృతదేహాన్ని సోహ్రాలోని ఓ జలపాతం సమీపంలో లోతైన లోయలో పోలీసులు గుర్తించారు. అతడి శరీరంపై కత్తి గాయాలు ఉండటంతో పోలీసులు హత్యగా అనుమానించారు. అనంతరం సోనమ్ కోసం గాలించగా.. ఉన్నట్టుండి జూన్ 7న ఆమె ఉత్తరప్రదేశ్‌లోని గాజీపుర్‌లో ప్రత్యక్షమైంది. ప్రియుడితో కలిసి ఆమే భర్తను హత్య చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో పోలీసులు ఆమెను అరెస్టు చేశారు. ఆమెకు సహకరించిన ప్రియుడు రాజ్ కుశ్వాహాతో సహా మొత్తం ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే, వీరిలో ముగ్గురికి ఇప్పటికే బెయిల్ లభించింది.

## 'మే డే'ను ఘనంగా నిర్వహించాలి



**సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలో మే 1న జరగనున్న మే డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఏఐటియుసి ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం నిర్వహించిన సంఘ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 141వ మే డే సందర్భంగా నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాడాలని సూచించారు. బ్రిటీష్ కాలంలో కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ఆటో, హమాలి, స్కీమ్ వర్కర్ల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దారం రోడ్డుకు చెందిన ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సిహెచ్ కాశీరావు, అడ్డా ఉపాధ్యక్షులు చాట్ల లక్ష్మయ్య, కొండపల్లి రాంబాబు, జక్కంపూడి వెంకట్, ప్రసాద్ సింగ్, గరికంటి అర్జున్ రావు, వినయ్, సక్కుర్తి వెంకటేష్, మామిళ్ళ వెంకటేశ్వరరావు, మేకల విజయ్, తడికమల్ల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా రంగంలో ములుగు మరో మైలురాయి



**ములుగు:** పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తీర్ణులైన ములుగు విద్యార్థులు రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచారని ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ అన్నారు. పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములుగు జిల్లా 99.30 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో మొదటి స్థానం పొందడం చాలా ఆనందదాయకమని అన్నారు. ఈ విజయం జిల్లా విద్యా రంగం కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. గత సంవత్సరం ఫలితాల్లో కూడా ములుగు జిల్లాలో ఉత్తీర్ణులైన విద్యార్థులను మంత్రి సీతక్క అభినందించి ప్రోత్సహించారని గుర్తు చేశారు. అదేవిధంగా రాష్ట్ర మంత్రి సీతక్క, మాజీ జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అందించిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వంతోనే ఈ ఏడాది రాష్ట్రంలో అగ్రస్థానం సాధించడం సాధ్యమైందని అభిప్రాయపడ్డారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యాశాఖ అధికారులు, జిల్లా యంత్రాంగానికి అభినందనలు తెలిపారు.

## పదో తరగతి ఫలితాల్లో ఎస్ఆర్ ప్రైమ్ విద్యార్థుల విజయకేతనం




**ఆదిలాబాద్:** పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఎస్ఆర్ ప్రైమ్ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చి పాఠశాల కీర్తిని చాటారు. క్రమశిక్షణతో కూడిన బోధన, విద్యార్థుల కఠోర శ్రమ కలిసివచ్చింది. ఈ ఫలితాల్లో పిరంగి వంశీ 600 మార్కులకు గాను 588 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. ఎన్.ధర్షిణి రెడ్డి 583 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. బి.అన్విక 582 మార్కులు సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. ఎ.తనుశ్రీ 580 మార్కులతో ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవిదాస్ మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన ఈ విజయం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని తెలిపారు. ఉపాధ్యాయుల ప్రత్యేక పర్యవేక్షణ, విద్యార్థుల పట్టుదలతోనే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ విజయంపై పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

# పదో తరగతి ఫలితాల్లో

## ఎస్ఆర్ డిజి స్కూల్ ప్రభంజనం!

- అశోక్‌నగర్ బ్రాంచ్ విద్యార్థుల సంచలన విజయం..
- జోనల్ ఇన్‌చార్జ్, ప్రిన్సిపాల్ హర్షం
- ప్రతిభ చాటిన తనిషా బేగం, మన్నా .. విజేతలకు ఘనంగా సన్మానం







**కరీంనగర్, ఏప్రిల్29 :** బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో అశోక్‌నగర్‌లోని ఎస్ఆర్ డిజి స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి సంచలనం సృష్టించారు. పాఠశాలకు చెందిన పలువురు విద్యా ర్థులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించి, విద్యా సంస్థ గరిష్ఠ విజయాల పరంపరను కొన సాగించారు. విద్యార్థిని తనిషా బేగం 576 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలవగా, మన్నా 567 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది. వీరితో పాటు షహాన్ (564), మణిచందన (563), ఇఫ్రా అనం (562) కూడా అత్యుత్తమ మార్కులు సాధించి పాఠశాల కీర్తిని చాటారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ స్కూల్స్ జోనల్ ఇన్‌చార్జ్ తిరుపతి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో ఎస్ఆర్ స్కూల్స్ అగ్రస్థానంలో నిలుస్తున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థుల నిరంతర శ్రమ, ఉపాధ్యాయుల ప్రత్యేక శిక్షణ వల్లే ఈ ఘనత సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ మానస మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ప్రోత్సాహం, యాజమాన్యం అందిస్తున్న వసతులు, ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణతోనే విద్యార్థులు ఈ స్థాయి మార్కులు సాధించ గలిగారని తెలిపారు.

### విద్యార్థులకు ఘన సన్మానం

సంచలన విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల ఆవరణలో యాజమాన్యం ఘనంగా సన్మానించింది. టాపర్లను శాలువాలతో సత్కరించి, వారి భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యా ర్థుల తల్లిదండ్రులు పాల్గొని విజేతలను అభినందించారు. అత్యుత్తమ ఫలితాలతో అశోక్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఎస్ఆర్ డిజి స్కూల్ మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది.

## కేసుల సత్వర పరిష్కారం కోసం కృషి చేయాలి

**జిల్లా న్యాయమూర్తి ఎ.వీరయ్య**



**ఆసిఫాబాద్ :** జిల్లా న్యాయస్థాన సముదాయంలో కొనసాగుతున్న అండర్ ట్రయల్ కేసుల సత్వర పరిష్కారం కోసం కృషి చేయాలని జిల్లా న్యాయమూర్తి ఎ.వీరయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థాన సముదాయంలో గల కార్యాలయంలో సీనియర్ సివిల్ జడ్జి-జిల్లా న్యాయ సేవ అధికారి వి. సంకేత్ మిత్ర, జిల్లా కలెక్టర్ కె. హరిత, జూనియర్ సివిల్ జడ్జ్ జె.అనంతలక్ష్మి , ప్రత్యేక సబ్ - జైల్ పర్యవేక్షకులు ప్రేమ్ కుమార్ లతో కలిసి కేసులకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అండర్ ట్రయల్ కేసులకు సంబంధించి కేసుల సత్వర పరిష్కారం కోసం అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అండర్ ట్రయల్ కేసులలో కక్షిదారుల పరిస్థితి, వివరాలు అడిగి తెలుసు కున్నారు. చార్జ్ షీట్ వేసిన/వేయని కేసులకు సంబంధించి వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. బెయిల్ మంజూరు అయిన వెంటనే నిర్ణీత నిబంధనలను పాటిస్తూ సంబంధిత వ్యక్తులను విడుదల చేయాలని, అండర్ ట్రియల్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.ఎస్.సి. ఫలితాలలో 98 శాతం ఉత్తీర్ణత

**జిల్లా కలెక్టర్ కె.హరిత**

**, ఆసిఫాబాద్:** 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఎస్.ఎస్.సి. ఫలితాలలో 98 శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖలో గల 37 ఆశ్రమ పాఠశాలలలో 10వ తరగతి పరీక్షలలో 13 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయని, 1 వేయి 302 మంది విద్యార్థులకు గాను 98 శాతం ఉత్తీర్ణతతో 1 వేయి 276 విద్యార్థులు అత్యంత సాధించారని, ఇందులో 531 మంది బాలురు, 745 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. జిల్లాలోని జైనూర్, కోహినూర్, మహాగావ్, రోంపల్లి, పంగిడిమాదర, సలుగుపల్లి, కమర్ గావ్, కేతిని, కంచనపల్లి, అనార్ పల్లి, రాంజీగూడ, సోమిని, పోచంలోద్ది పాఠశాలలు 100 శాతం ఫలితాలు సాధించాయని తెలిపారు. జైనూర్ బతుకమ్మ పాఠశాలకు చెందిన పి.లోకేశ్వరి 542 మార్కులు, సిర్పూర్ - టి ఆశ్రమ పాఠశాలకు చెందిన ఎం.ఆర్థిక, జి.సువర్ణ 537 మార్కులు, జైనూర్ పాఠశాలకు చెందిన ఎ. సంధ్యారాణి 535 మార్కులు సాధించాలని తెలిపారు. ఉత్తమ ఫలితాల సాధనలో గిరిజన సంక్షేమ శాఖ, అధికారుల కృషి అభినందనీయమని తెలిపారు.

## పది ఫలితాల్లో గురుకుల విద్యార్థుల ప్రభంజనం

**578 మార్కులతో టాపర్‌గా నిలిచిన శ్రీహర్ష..**

- ప్రతిభ చాటిన 68 మంది విద్యార్థులు
- 16 మందికి 550పైగా మార్కులు..
- విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపాల్ మణిదీప్తి


రక్షిత


పూర్విక


సాహితి


శ్రీహర్ష


సాయి నివేదిత

**పెద్దపల్లి, ఏప్రిల్29:** బుధవారం వెలువడిన 2026 పదో తరగతి ఫలితాల్లో పెద్దపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరిచి సంచలనం సృష్టించారు. ఈ విద్యా సంవత్సరం పరీక్షలకు హాజరైన 69 మంది విద్యార్థులలో ఏకంగా 68 మంది ఉత్తీర్ణులై, పాఠశాల కీర్తిని దశదిశలా చాటారు. మొత్తంగా 98.5 శాతం ఉత్తీర్ణత నమోదు చేయడం విశేషం. ముఖ్యంగా శ్రీహర్ష అనే విద్యార్థిని 578 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలవగా, కే సాయి నివేదిత 574 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది.

### మార్కుల సునామీ..

ఈ ఫలితాల్లో కేవలం ఉత్తీర్ణతకే పరిమితం కాకుండా, అత్యుత్తమ స్కోర్లతో విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం విద్యార్థుల్లో 16 మంది 550కి పైగా మార్కులు సాధించగా, 22 మంది 540కి పైగా మార్కులతో ప్రతిభ కనబరిచారు. టాపర్లుగా నిలిచిన వారిలో యు. సాహితీ (565), వై. పూర్విక (564), ఎన్. రక్షిత (563) తర్వాతి స్థానాల్లో నిలిచి పాఠశాల గౌరవాన్ని పెంచారు. గురుకుల విద్యా విధానం, ఉపాధ్యాయుల ప్రత్యేక పర్యవేక్షణే ఈ భారీ విజయానికి మూలమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

### కృషికి దక్కిన ఫలితం..

ఈ అద్భుత విజయంపై పాఠశాల ప్రిన్సిపాల్ మణిదీప్తి హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల కఠోర శ్రమ, ఉపాధ్యాయుల అంకితభావం మరియు తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ స్థాయి ఫలితాలు సాధ్యమయ్యాయని ఆమె పేర్కొన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించిన ప్రిన్సిపాల్, భవిష్యత్తులో వారు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. గురుకుల పాఠశాలలు కార్పొ రేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోవని ఈ ఫలితాలు మరోసారి నిరూపించాయని పాఠశాల సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

# పదవ తరగతి ఫలితాల్లో ములుగు జిల్లా అగ్రస్థానం

## మంత్రి సీతక్క హర్షం



**ములుగు:** పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ములుగు జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా ప్రథమ స్థానంలో నిలవడం పట్ల పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కష్టపడి చదివి అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులకు, వారికి మార్గనిర్దేశం చేసిన గురువులకు, అలాగే పర్యవేక్షణలో కీలకపాత్ర పోషించిన జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ అధికారులకు మంత్రి అభినందనలు తెలిపారు. ములుగు జిల్లా 99.30 శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఇది జిల్లా స్థాయిలో సమన్వయంతో చేసిన కృషికి నిదర్శనమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షల్లో మొత్తం ఉత్తీర్ణత శాతం 95.15 శాతంగా నమోదు కావడం సంతోషకరమని తెలిపారు. బాలికలు 96.26 శాతం ఉత్తీర్ణతతో ముందంజలో ఉండగా, బాలురు 94.07 శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని కొనియాడారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా 5731 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత నమోదు చేయడం విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని సూచిస్తోందని తెలిపారు. సంక్షేమ పాఠశాలల్లో 99.10 శాతం ఉత్తీర్ణత నమోదవడం ప్రభుత్వ పథకాల ఫలితమని అన్నారు. పేద, వెనుకబడిన వర్గాల పిల్లలకు అందుతున్న నాణ్యమైన విద్యతోనే ఈ స్థాయి ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పర్యటన



**సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పలు ధార్మిక, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని స్థానిక ప్రజలను కలిశారు. పెనుబల్లి మండలం గణేషన్ పాడు (సొబ్బాయిగూడెం) గ్రామంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహేంద్రస్వామి దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే పెనుబల్లి మండలం ఎడ్ల బంజర గ్రామానికి చెందిన విపిరిశెట్టి రామయ్య ఇంట్లో జరిగిన వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. గంగదేవిపాడు గ్రామంలో కాక రామారావు కుమారుడు కాక సాజిత్ వివాహానికి హాజరై ఆశీర్వాదాలు అందించారు. సత్తుపల్లి మండలం కొత్తూరు గ్రామంలో జరిగిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి, శ్రీ పద్మావతి అమ్మవారు, శ్రీ పట్టాభిరామచంద్ర స్వామివారి జీవ ధ్వజస్థంభ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఇదే క్రమంలో కృష్ణాపురం గ్రామంలో లక్ష్మీ మమత, వేణుగోపాల్ వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. గౌరిగూడెం గ్రామంలో మణికంఠ–హేమ దంపతుల కుమారుడు యోగి హన్వృత్ అన్నప్రాశన కార్యక్రమంలో పాల్గొని ఆశీస్సులు అందించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నీటి సమస్యకు తక్షణ పరిష్కారం

- **ఎమ్మెల్యే నాగరాజు క్షేత్రస్థాయి పర్యటన**
- **గంటల వ్యవధిలోని మోటర్ల మరమ్మతులు**






వరంగల్: వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 43వ డివిజన్ పరిధిలోని గణేష్ నగర్, టీచర్స్ కాలనీ, నక్కలపల్లి, వినాయక నగర్, రామ్గోపాల్పురం ప్రాంతాల్లో తలెత్తిన నీటి సరఫరా అంతరాయం సమస్యపై వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. స్థానికుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సమస్య తీవ్రతను స్వయంగా పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు స్పందించి నక్కలపల్లి ప్రాంతంలో గంటల వ్యవధిలోనే మోటార్ మరమ్మతు పనులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఎమ్మెల్యే తక్షణ స్పందనతో సమస్య పరిష్కారం కావడం పట్ల స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కారం చూపిన ఎమ్మెల్యే నాగరాజుకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

# రెండు వారాలకు పైగా దగ్గు ఉంటే క్షయవ్యాధిగా అనుమానించాలి

## డాక్టర్ సుధాకర్ నాయక్



**తాండూర్:** రెండు వారాలకు పైగా దగ్గు లక్షణాలు కొనసాగితే క్షయవ్యాధిగా అనుమానించాలని క్షయ వ్యాధి ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ అన్నారు. బుధవారం తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మాధారం గ్రామ పంచాయతీలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా పేషెంట్లతో మాట్లాడారు. క్షయవ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తూ వ్యాధి వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అవగాహన పోస్టర్లను విడుదల చేసి, సిబ్బంది, పేషెంట్లతో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లాలోని ప్రతి ఆరోగ్య కేంద్రంలో క్షయవ్యాధి నిర్ధారణకు తెమడ పరీక్షలు, ఎక్సరే పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఉచిత చికిత్సతో పాటు, చికిత్స పూర్తయ్యే వరకు ప్రతినెల రూ.వెయ్యి పోషణ భత్యం ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్నవారికి క్షయ వ్యాధి త్వరగా వ్యాపించే అవకాశం ఉందని, పోషకాహారంతో కూడిన సమతూల్య ఆహారం తీసుకోవడం అవసరమని సూచించారు. తుంపర్ల ద్వారా వ్యాప్తి చెందే ఈ వ్యాధి మద్యం సేవించే వారు, పొగాకు వినియోగించే వారిలో ఎక్కువగా కనిపించే ప్రమాదం ఉందని తెలిపారు. ఫోర్టబుల్ ఎక్సరే ద్వారా 74 మందికి పరీక్షలు నిర్వహించగా, 10 మందికి తెమడ పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూర్ పీహెచ్సీ వైద్యులు డాక్టర్ యూన్సీరాణి, టీబీ సూపర్వైజర్ శశికాంత్, మాధారం సర్పంచ్ కృష్ణపల్లి లక్ష్మణ్, ఐఎన్టియుసి ఏరియా ఉపాధ్యక్షులు పేరం శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి అల్లాఉద్దీన్, హెల్త్ సూపర్వైజర్ తార, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ల్యాబ్ టెక్నీషియన్ హాకీం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి ఫలితాల్లో శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థుల ప్రభంజనం



ఆద్య



అన్వేష్



అక్షిత


**ఆదిలాబాద్:** విద్యా రంగంలో తనదైన ముద్ర వేస్తూ శ్రీ చైతన్య పాఠశాల పదవ తరగతి ఫలితాల్లో ప్రభంజజనం సృష్టించింది. పదవ తరగతి ఫలితాల్లో పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఫలితాలను సాధించి సత్తా చాటారు. క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన బోధన, నిరంతర పర్యవేక్షణే ఈ విజయానికి ప్రధాన కారణమని విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. ఈ ఫలితాల్లో జి.ఆద్య 600 మార్కులకు గాను 583 మార్కులు సాధించి టాపర్గా నిలిచారు. ఆర్.అన్వేష్ 583 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. జి.అక్షిత 582 మార్కులు సాధించి మేటి విద్యార్థిగా నిలిచారు. ఈ విజయోత్సాహంలో ప్రధానోపాధ్యాయులు ఎన్.శ్రీనివాస్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఆయన రూపొందించిన ప్రత్యేక విద్యా ప్రణాళికలు, ఉపాధ్యాయుల అంకితభావం, విద్యార్థుల కృషి కలిసివచ్చి ఈ ఘన ఫలితాలు సాధ్యమయ్యాయని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, పట్టుదల పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. పగలు, రాత్రి కష్టపడి చదివిన విద్యార్థుల శ్రమే ఈ ఫలితాలకు మూలమని పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉన్నత స్థానాలు సాధించాలని ఆకాంక్షించారు.

# పదో తరగతి ఫలితాల్లో విద్యా భారతి టాపర్




**తాండూర్:** పదో తరగతి ఫలితాల్లో విద్యా భారతి పాఠశాల విద్యార్థులు బెల్లంపల్లి నియోజకవర్గ స్థాయిలో టాపర్లుగా నిలిచారని పాఠశాల డైరెక్టర్ శరత్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థిని ఉమ్మెసబియా 583 మార్కులు సాధించి బెల్లంపల్లి పరిధిలోని అన్ని మండలాల్లో టాప్గా నిలిచింది. అదేవిధంగా ఎన్.సహస్ర 578 మార్కులు, ఎం.తరుణి 577, కె.అంజలి 575, తహాస్య రాఘవి 575 మార్కులతో మండల స్థాయిలో ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఈ ఏడాది 79 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందరూ ఉత్తీర్ణులై వంద శాతం ఫలితాలు సాధించడం విశేషమన్నారు. వీరిలో 32 మంది విద్యార్థులు 550కి పైగా మార్కులు సాధించగా, మరో 32 మంది 500కి పైగా మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. నిరంతర శ్రమ, క్రమశిక్షణ, ఉపాధ్యాయుల పర్యవేక్షణతోనే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సౌమ్య, ప్రిన్సిపాల్ సహాయ సరోజిని, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వధూవరులకు ఆడే గజేందర్ ఆశీస్సులు



**గుడిహత్నూర్:** నేరడిగొండ మండలంలోని బొందిడి గ్రామంలో బుధవారం ఆడే భీంరావు కుమార్తె వివాహ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ఈ శుభకార్యానికి కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకలో గుడిహత్నూర్ సర్పంచ్ ఆడే శీల రాజేశ్వర్ సతీసమేతంగా పాల్గొన్నారు. ఆడే గజేందర్తో కలిసి వారు వధూవరులకు అక్షింతలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. అతిథులతో, గ్రామస్తులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. వేడుకలో సాంప్రదాయ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించగా, బంధువులు, గ్రామ ప్రజలు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

# అవగాహనతోనే మోసాలకు చెక్

## జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్



**మంచిర్యాల:** సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, అవగాహనతోనే మోసాలకు చెక్ పెట్టవచ్చని జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్ అన్నారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని నర్సింగ్ కళాశాలలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమావేశానికి ఎస్సై మధుసూదన్, కళాశాల ప్రిన్సిపాల్ కె.సుజాత, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆనంద్లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాల రకాలు, వాటి నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆన్లైన్లో సురక్షితంగా ఉండే విధానాలను తెలుసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలకు సంబంధించి అత్యవసర సహాయం కోసం సైబర్ క్రైమ్ హెల్ప్లైన్ 1930, పిల్లల సమస్యల కోసం చైల్డ్ హెల్ప్లైన్ 1098ను సంప్రదించవచ్చని తెలిపారు. విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్, సందేశాలు, లింక్ల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గోండు హర్కాపూర్లో వికాస్ 'టీల' కార్యక్రమం



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** మండలంలోని గోండు హర్కాపూర్ (శాంతపూర్) గ్రామంలో బుధవారం నిర్వహించిన వసంత్ దుద్రం కుమారుడు వికాస్ 'టీల' కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కుటుంబ పెద్దలతో కలిసి కార్యక్రమంలో పాల్గొని సాంప్రదాయ వేడుకలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ బోథ్ నియోజక అధ్యక్షులు బద్దం పోతారెడ్డి, సీనియర్ నాయకులు మౌలానా, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కరాడ్ విష్ణు, మండల ఎస్సీ నాయకులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పది ఫలితాల్లో వాగ్దారి యువకుడి ప్రతిభ

- **550 మార్కులతో మెరిసిన గుమ్ముల వర్షిత్**



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో మండలంలోని వాగ్దారి గ్రామానికి చెందిన విద్యార్థి గుమ్ముల వర్షిత్ అద్భుత ప్రతిభ కనబర్చాడు. మొత్తం 600 మార్కులకు గాను 550 మార్కులు సాధించి అందరి ప్రశంసలు అందుకున్నాడు. వర్షిత్ వాగ్దారి గ్రామ మాజీ సర్పంచ్ గుమ్ముల గంగాదేవి మనువడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుమ్ముల మురళి కుమారుడు. ఆయన ఆదిలాబాద్ మండలం పిప్పర్వాడలోని అభ్యుదయ పాఠశాలలో విద్యాభ్యాసం చేశాడు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన సందర్భంగా వర్షిత్ను గ్రామస్తులు, బంధువులు అభినందించారు. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ వర్షిత్ మొదటి నుంచి చదువులో ఎంతో కష్టపడేవాడని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆశిస్తున్నామని తెలిపారు.

# నేరడిగొండ ఆశ్రమ పాఠశాల ఘనత

- **పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత**

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని లఖంపూర్ గ్రామ ప్రభుత్వ ఆశ్రమ గిరిజన బాలికల ఉన్నత పాఠశాల పదో తరగతి ఫలితాల్లో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరైన 75 మంది విద్యార్థినులు అందరూ ఉత్తీర్ణత సాధించి పాఠశాల వంద శాతం ఫలితాలను సొంతం చేసుకుంది. పాఠశాలకు చెందిన పవార్ శాలిని 568 మార్కులు సాధించి పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడమే కాకుండా, మండల స్థాయిలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుని ప్రతిభ చాటింది. అలాగే కొడప లోకేశ్వరి 563 మార్కులతో ద్వితీయ స్థానాన్ని, చౌహాన్ సింధు 562 మార్కులతో తృతీయ స్థానాన్ని సాధించి పాఠశాలకు పేరు తెచ్చారు. ఈ ఘనవిజయం సాధించడంలో ప్రధానోపాధ్యాయులు అర్క మధుకర్ పర్యవేక్షణతో పాటు ఉపాధ్యాయులు వీరమల్ల రాజేశ్వర్, జాదవ్ రాజు నాయక్, రూపావత్ బాబూసింగ్, హెచ్డబ్ల్యూఓ స్వప్న తదితరులు చేసిన కృషి ఎంతో ఉందని పాఠశాల వర్గాలు కొనియాడాయి. విద్యార్థినుల నిరంతర శ్రమ, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారంతోనే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను పాఠశాల సిబ్బంది, స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు.

## ఆసుపత్రికి వెళ్లిన సమయంలో ఇంట్లో చోరీ.. కేసు నమోదు.

**నిజామాబాద్ రూరల్ ముగ్పాల్, :**



ముగ్పాల్ మండలం మంచిప్ప గ్రామానికి చెందిన కోవూరి శంకర్ రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో ఆయన భార్య కోవూరి పద్మ ఇంటికి తాళం వేసి ఆసుపత్రికి వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించి 2.5 తులాల బంగారు ఆభరణాలు, రూ.1.20 లక్షల నగదు అపహరించినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసినట్లు ముగ్పాల్ ఎస్ఐ సుష్మిత తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు.

# మంత్రి సీతక్కకు ఉత్తమ సేవా పురస్కారం

- **పురస్కారం అందజేసిన మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు**




**ములుగు:** శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంత్రి సీతక్క ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్ మాదాపూ ర్లోని శిల్పకళా వేదికలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు మంత్రి సీతక్కకు ఈ పురస్కారాన్ని అందజేశారు. వేలాది మంది విద్యార్థుల సమక్షంలో మంత్రి సీతక్క ఈ గౌరవాన్ని అందుకోవడం విశేషంగా నిలిచింది. ప్రజాసేవలో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మహిళలు, చిన్నారుల సంక్షేమం కోసం మంత్రి సీతక్క అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, అధికారులు పాల్గొని మంత్రి సీతక్క సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకోవడం గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. ప్రజాసేవలో సుదీర్ఘ అనుభవం కలిగిన వెంకయ్య నాయుడు అంటే అందరికీ గౌరవమని, ఆయన సూచనలు దేశానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. సాధనతోనే విజయాలు సాధ్యమని, ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకుని కృషి చేయాలని సూచించారు. విద్యార్థి దశలో కష్టపడితే జీవితాంతం గౌరవంగా జీవించవచ్చని, ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. చదువు మనిషి ఆత్మగౌరవాన్ని పెంచుతుందని, విద్యే శాశ్వతమని, దానిని ఎవరూ దొంగిలించలేరని స్పష్టం చేశారు. పదో తరగతితో చదువు ఆపిన తాను తర్వాత మళ్లీ విద్యను కొనసాగించి ఎల్ఎల్బి, ఎల్ఎల్ఎం, పీహెచ్డీ పూర్తి చేశానని చెప్పారు. ప్రజాసేవలో కొనసాగుతూనే చదువును ఎక్కడా ఆపలేదని పేర్కొన్నారు. ములుగు జిల్లా పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో తొలి స్థానంలో నిలవడం పట్ల మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. టీచర్లు క్రమశిక్షణతో పాఠాలు బోధించడం, అప్పటి జిల్లా కలెక్టర్ దివాకర్, జిల్లా యంత్రాంగం సమన్వ యంతో పనిచేయడంతోనే ఈ విజయం సాధ్యమైందని అన్నారు. పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు శుభా కాంక్షలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో మంత్రి కొండా సురేఖ, సుప్రసిద్ధ జర్నలిస్ట్ వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి ఫలితాల్లో కాకతీయ హైస్కూల్ ప్రభంజనం

- **టాపర్లుగా హారిక, జియా మహీన్, సనా ఫిర్దోస్**
- **వంద శాతం ఉత్తీర్ణత**


హారిక


జియా మహీన్


సన ఫిర్దోసి

**ఆదిలాబాద్:** తెలంగాణ రాష్ట్ర పదో తరగతి ఫలితాల్లో ఆదిలాబాద్ పట్టణంలోని ప్రముఖ విద్యాసంస్థ కాకతీయ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాల కీర్తిని చాటారు. ప్రతియేటా ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ముందంజలో నిలిచే ఈ పాఠశాల, ఈ ఏడాది కూడా వంద శాతం ఉత్తీర్ణతతో పాటు అత్యుత్తమ మార్కులు సాధించి మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. ఈ ఫలితాల్లో పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినిలు అత్యధిక మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. హారిక 579 మార్కులు సాధించి పాఠశాల టాపర్గా నిలవగా, షేక్ జియా మహీన్ 564 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది. సనా ఫిర్దోస్ 551 మార్కులు సాధించి మూడవ స్థానాన్ని దక్కించుకుంది. హారిక మొదటి నుంచి చదువులో చురుగ్గా ఉండి క్రమశిక్షణతో చదివి ఈ ఘనత సాధించగా, జియా మహీన్ సబ్జెక్టులపై పట్టు సాధించి ప్రణాళికాబద్ధంగా చదవడంతోనే ఈ విజయాన్ని అందుకుంది. సనా ఫిర్దోస్ పట్టుదలతో కృషి చేస్తే ఫలితాలు వాటంతట అవే వస్తాయని నిరూపించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రూబీ సలీం, యాజమాన్యం విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల క్రమశిక్షణ, ఉపాధ్యాయుల ప్రత్యేక పర్యవేక్షణ ఈ విజయానికి ప్రధాన కారణమని తెలిపారు. కాకతీయ హైస్కూల్ కేవలం చదువుకే కాకుండా విద్యార్థుల సమగ్ర వికాసానికి పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. విజయం సాధించిన టాపర్లను పాఠశాల ప్రాంగణంలో ఘనంగా సత్కరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం, ప్రధానోపాధ్యాయురాలు రూబీ సలీం తీసుకున్న ప్రత్యేక శ్రద్ధతోనే తమ పిల్లలు ఈ స్థాయి మార్కులు సాధించగలిగారని కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయోత్సవంలో ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, తోటి విద్యార్థులు పాల్గొని టాపర్లకు శుభాకాంక్షలు తెలిపారు.

# సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు

- **ప్రజలు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలి**
- **జిల్లా కలెక్టర్ రాజర్షి షా**




**ఆదిలాబాద్:** ప్రస్తుత సమాజంలో సాంకేతికత ఎంతగా విస్తరిస్తోందో అదే స్థాయిలో సైబర్ నేరాలు కూడా పెరిగిపోతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. బుధవారం స్థానిక టీటీడీసీలో "ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక"లో భాగంగా సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా సామాన్య ప్రజలకు సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. చదువుకున్న వారు, ఉన్నత పదవుల్లో ఉన్నవారు కూడా సైబర్ మోసాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఒక రిటైర్డ్ ఐఐటీ ప్రొఫెసర్ సుమారు రూ.4 కోట్లు సైబర్ నేరగాళ్ల చేతిలో కోల్పోయిన ఘటనను ఉదాహరణగా పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త పద్ధతులతో ప్రజలను మోసం చేస్తున్నారని, ముఖ్యంగా డీప్ ఫేక్ టెక్నాలజీ ద్వారా ముఖాలు, గొంతులను మార్చి నకిలీ వీడియోలు రూపొందించడం, పోలీసుల పేరుతో డిజిటల్ అరెస్ట్ చేస్తామని భయపెట్టి డబ్బులు వసూలు చేయడం వంటి ఘటనలు పెరిగాయని తెలిపారు. గిఫ్ట్ కార్డ్ ఫ్రాడ్స్, కేవైసీ అప్డేట్ పేరుతో మోసాలు, క్యూఆర్ కోడ్ స్కామ్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రజలు తమ వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోకూడదని, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్వర్డ్లు, ఓటీపీలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు చెప్పవద్దని స్పష్టం చేశారు. అనుమానాస్పద కాల్స్, లింకులు, సందేశాలకు దూరంగా ఉండాలని కోరారు. ప్రభుత్వం, పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగాలు, నేషనల్ సైబర్ సెక్యూరిటీ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం సైబర్ నేరాలపై అవగాహన పోస్టర్లు, జాబ్ మేళా పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సురేందర్ రావు, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ప్రిన్సిపల్, పోలీసు, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్:** జిల్లా వ్యాప్తంగా ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. బుధవారం స్థానిక భుక్తాపూర్లోని విద్యుత్ డివిజన్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ విభాగాలను సందర్శించి అటెండెన్స్ రిజిస్టర్లు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అధికారుల పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత వేసవి కాలంలో జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వినియోగం పెరిగిన నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతర సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నాణ్యమైన విద్యుత్ అందేలా చూడాలని స్పష్టం చేశారు. రైతులు విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడకుండా క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా ట్రాన్స్ఫార్మర్లు దెబ్బతిన్నా, సాంకే తిక లోపాలు తలెత్తినా నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోగా పునరుద్ధరించాలని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం జరిగితే సహించేది లేదని, ప్రజలకు అందు బాటులో ఉంటూ సేవలు అందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్.శేషారావు, ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

**మండల టాపర్గా తేజస్వి**








**తాండూర్:** పదో తరగతి ఫలితాల్లో తాండూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాండూర్కు చెందిన తేజస్వి 560 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మండల టాపర్గా నిలిచింది. రెండవ స్థానంలో అచలాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన చీర్ల హరిచరణ్ 559 మార్కులు సాధించగా, తాండూర్ కేజీబీవీ పాఠశాలకు చెందిన పెట్టం స్నేహిత కూడా 559 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచింది. ప్రైవేట్ పాఠశాలల విభాగంలో విద్యా భారతి ఉన్నత పాఠశాలకు చెందిన ఉమ్మె సబియా 583 మార్కులు సాధించి మండల టాపర్గా నిలిచింది. అదే పాఠశాలకు చెందిన నూతి సహస్ర 578 మార్కులు, మైలారపు తరుణి 577 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచారు. మండల మూడో స్థానంలో విద్యా భారతి పాఠశాలకు చెందిన కూచుల అంజలి 575 మార్కులు సాధించగా, సెయింట్ తెరిసా పాఠశాలకు చెందిన ఎండీ వసీం జాఫర్ 575 మార్కులతో మెరిశాడు. అలాగే మండలంలోని ఎంజేపీటీసీ (బీసీ) పాఠశాలకు చెందిన పనస అక్షిత వర్మ కూడా 575 మార్కులు సాధించింది. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మండల విద్యాధికారి డి.శ్రీనివాస్ అభినందించారు. కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

# మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి






• స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఆర్.దశరథ్

**మంచిర్యాల:** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, మంచిర్యాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పరిశీలకులు ఆర్.దశరథ్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, ప్రత్యేక ఉప పాలనాధికారి చంద్రకళలతో కలిసి అన్ని మండలాల తహశీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో మ్యాపింగ్ శాతాన్ని పెంచడం అత్యవసరమని తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఓటర్ల జాబితాలు ఎన్నికల కమిషన్ వెబ్సైట్లు, ఓటర్ సర్వీస్ పోర్టల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. జిల్లా, మండల స్థాయి అధికారులు తమ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు బూత్ స్థాయి అధికారులను సంప్రదించి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫారం-6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను ధ్రువీకరించి తొలగించడం, సవరణ చేయాలని ఆదేశించారు. అదే నియోజకవర్గంలో చిరునామా మార్చుకున్న వారికి నోటీసులు జారీ చేసి సరైన చిరునామాలో ఓటు నమోదు చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో డబుల్ ఓటర్లను గుర్తించి తొలగించాలని, ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దినపత్రికలు, స్థానిక ఛానళ్ల ద్వారా ప్రచారం నిర్వహించాలని అన్నారు. అధికారులు సమన్వయంతో కృషి చేసి ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు





**మంచిర్యాల:** నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన ప్రతి ఒక్కరికి కేటాయించడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని చెన్నూర్ మండలం బావురావుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హత ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇండ్లు రానివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి అర్హుడికి ఇల్లు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం 100 ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉండగా, మిగిలిన ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయని పేర్కొన్నారు. బావురావుపేట నుంచి కత్తెరసాల వరకు రూ.5 కోట్లు, బావురావుపేట నుంచి కాచనపల్లి వరకు రూ.3 కోట్లతో రహదారి పనులు చేపట్టినట్లు చెప్పారు. చెన్నూర్ నియోజకవర్గంలో రహదారులు, మురుగు కాలువలు, తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. భూ నిర్వాసితులకు రూ.26కోట్ల నష్టపరిహారం మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో 300 బోర్వెల్స్ ఏర్పాటు చేసి నీటి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం తొలి విడతలో విడుదలైన నిధులతో పనులు కొనసాగుతున్నాయని, లబ్ధిదారులకు దశలవారీగా బిల్లులు చెల్లిస్తున్నామని చెప్పారు. రెండో విడత కార్యక్రమాన్ని జూన్ నెలలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. నిరుద్యోగ యువతకు విదేశీ ఉపాధి అవకాశాల కోసం జర్మన్ భాష శిక్షణతో పాటు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ద్వారా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి , షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నాయకత్వ పటిమకు శిక్షణ శిబిరాలు కీలకం

**డీసీసీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్**

**ఆదిలాబాద్:** నాయకత్వ పటిమకు శిక్షణ శిబిరాలు ఎంతో కీలకమని డీసీసీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ అన్నారు. హైదరాబాద్లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సమర్థ్' శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు. ఆదిలాబాద్ సేవాదళ్ జనరల్ సెక్రటరీ అఫ్సర్ ఖాన్ తో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ శిబిరానికి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సేవాదళ్ వాలంటీర్లు బలమైన వారధిగా పనిచేస్తున్నారని కొనియాడారు. డాక్టర్ నరేష్ జాదవ్ నాయకత్వంలో ఆదిలాబాద్ జిల్లాలో పార్టీ బలోపేతానికి జరుగుతున్న కృషిని ప్రశంసించారు. రాజకీయాల్లో స్వార్థం పెరిగిపోతున్న తరుణంలో సేవాదళ్ కార్యకర్తలు నిస్వార్థంగా పనిచేయడం అభినందనీయమన్నారు. ప్రత్యర్థులు సోషల్ మీడియాలో చేసే అసత్య ప్రచారాలను తిప్పికొట్టేలా కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు లభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం డాక్టర్ నరేష్ జాదవ్ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ తరగతులు కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సేవాదళ్ విభాగం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ జెండాను మరింత ఎత్తున ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. నిబద్ధత గల కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించేలా సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుల దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ ఇవ్వడం కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది.



# ఆదిలాబాద్ పట్టణాభివృద్ధే లక్ష్యం

• మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్



**ఆదిలాబాద్:** ఆదిలాబాద్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ స్పష్టం చేశారు. బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో పట్టణ అభివృద్ధికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మున్సిపల్ వాహనాల నిర్వహణ కోసం రూ.50 లక్షల వ్యయంతో సొంత గ్యారేజ్, రిపేరింగ్ షెడ్డు, వాటర్ వాషింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అన్ని సామాజిక వర్గాల స్మశానవాటికల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. పట్టణంలో తాగునీరు, శానిటేషన్, స్ట్రీట్ లైట్ల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల కోసం ప్రత్యేక నిధులు కేటాయించి వారి సంక్షేమానికి పెద్దపీట వేశామని పేర్కొన్నారు. ప్రజలు తమ వార్డుల్లోని సమస్యలను కౌన్సిలర్ల దృష్టికి, లేనియెడల నేరుగా మున్సిపల్ కార్యాలయానికి తీసుకురావాలని కోరారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని 49 వార్డుల్లో విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వంగిన స్తంభాలు, కొత్త ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటుపై విద్యుత్ శాఖాధికారులతో సమన్వయం చేస్తూ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కళ్యాణలక్ష్మి , షాదీముబారక్ వంటి ప్రభుత్వ పథకాల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. పెన్షన్ల పంపిణీలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గోడం నగేశ్, కమిషనర్, ఇతర శాఖల అధికారులు పాల్గొని చైర్పర్సన్ నిర్ణయాలకు మద్దతు తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని, ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీ పడే ప్రసక్తే లేదని చైర్ పర్సన్ స్పష్టం చేశారు.

# ఇందిరమ్మ గృహప్రవేశం



**బేల:** మండలంలోని సాంగిడి గ్రామానికి చెందిన జున్ఘరే చంద్రకళ–సుభాష్ కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. బుధవారం నూతన గృహప్రవేశ కార్యక్రమాన్ని లబ్ధిదారులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ జిమ్మ శేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం కుటుంబ సభ్యులకు సారె పెట్టి వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా సామ రూపేష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ పథకం ద్వారా గృహాలు కల్పిస్తోందన్నారు. ఎన్నో ఏళ్ల కల నెరవేరడంతో లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోందని పేర్కొన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఇవ్వాలని వినతులు సమర్పించిన పలువురు అర్హులకు ఇళ్లు రాలేదని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. బేల మండలంలో అర్హులైన వారందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరవుతాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సామ నర్సారెడ్డి, వార్డ్ మెంబర్ మంచికంటి ఊషన్న, గెడం సతీష్, మంచికంటి సాయి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ మేకల జితేందర్, ప్రకాష్ నవగరే, రవీందర్ పటేల్, దేవన్న, చవాన్ సుధాకర్, దయాకర్ పటేల్, సునీల్, సామ శ్రీపాల్ రెడ్డి, మారుతి, బోయర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి ఫలితాల్లో ఎస్ఆర్ డిజి స్కూల్ ప్రభంజనం

**అశోక్నగర్ బ్రాంచ్ విద్యార్థుల సంచలన విజయం**

**టాపర్లకు ఘన సన్మానం**

**కరీంనగర్:** పదో తరగతి ఫలితాల్లో అశోక్నగర్లోని ఎస్ఆర్ డిజి స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చి సంచలనం సృష్టించారు. పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించి సంస్థ విజయపతాకాన్ని ఎగురవేశారు. విద్యార్థిని తనిషా బేగం 576 మార్కులతో పాఠశాల టాపర్గా నిలవగా, మన్షా 567 మార్కులతో ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. షహాన్ 564, మణిచందన 563, ఇఫ్రా అనం 562 మార్కులు సాధించి పాఠశాల ప్రతిష్ఠను మరింత పెంచారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ స్కూల్స్ జోనల్ ఇంచార్జ్ తిరుపతి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో ఎస్ఆర్ స్కూల్స్ అగ్రస్థానంలో నిలుస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల ప్రత్యేక శిక్షణతోనే ఈ విజయం సాధ్యమైందన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ మానస మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహం, యాజమాన్యం కల్పిస్తున్న సౌకర్యాలు, ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణతోనే విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించగలిగారని తెలిపారు.

**విజేతలకు ఘన సన్మానం..**

అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ఆవరణలో యాజమాన్యం బుధవారం ఘనంగా సన్మానించింది. టాపర్లకు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. వారి భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని విజేతలను అభినందించారు.

# పది ఫలితాల్లో గురుకుల విద్యార్థుల ప్రభంజనం

**578 మార్కులతో టాపర్గా శ్రీహర్ష**

**98.5 శాతం ఉత్తీర్ణత నమోదు**


**పెద్దపల్లి:** పదో తరగతి ఫలితాల్లో పెద్దపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి సంచలనం సృష్టించారు. ఈ విద్యా సంవత్సరంలో పరీక్షలకు హాజరైన 69 మంది విద్యార్థుల్లో 68 మంది ఉత్తీర్ణులై పాఠశాలకు 98.5 శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థి శ్రీహర్ష 578 మార్కులతో పాఠశాల టాపర్గా నిలవగా, కె.సాయి నివేదిత 574 మార్కులతో ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది.

**మార్కుల సునామీ..**

ఈ ఫలితాల్లో కేవలం ఉత్తీర్ణతకే పరిమితం కాకుండా, అత్యుత్తమ మార్కులతో విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం విద్యార్థుల్లో 16 మంది 550కి పైగా మార్కులు సాధించగా, 22 మంది 540కి పైగా మార్కులతో ప్రతిభ కనబరిచారు. టాపర్లుగా నిలిచిన వారిలో యు.సాహితీ 565, వై.పూర్విక 564, ఎన్.రక్షిత 563 పాఠశాల గౌరవాన్ని పెంచారు. గురుకుల విద్యా విధానం, ఉపాధ్యాయుల ప్రత్యేక పర్యవేక్షణే ఈ భారీ విజయానికి మూలమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

**కృషికి దక్కిన ఫలితం..**

ఈ అద్భుత విజయంపై పాఠశాల ప్రిన్సిపాల్ మణిదీప్తి హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల కఠోర శ్రమ, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారంతోనే ఈ స్థాయి ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. గురుకుల పాఠశాలలు కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోవని ఈ ఫలితాలు మరోసారి నిరూపించాయని ఆనందం వ్యక్తం చేశారు.



# భారతీయ సినిమా పితామహులు ఫాల్కే

## నేడు దాదాసాహెబ్ జయంతి

దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గురించి భారత దేశములో తెలియని వారు ఉండరేమో. భారతీయ సినిమాకు గణనీయమైన సేవ చేసిన వారికి ప్రతి సంవత్సరం ఇచ్చే పురస్కారం దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు. భారతీయ సినిమాకు పితా మహునిగా భావించబడే ఫాల్కే జన్మదిన సందర్భంగా 1969లో ఈ పురస్కారం ఏర్పాటు చేయబడింది. అయితే ఫాల్కే గురించి మాత్రం చాలా మందికి తెలియదంటే ఆశ్చర్యం కలుగ మానదు. భారతీయ సినిమా పరిశ్రమ ప్రపంచం లోనే అతిపెద్ద పరిశ్రమలలో ఒకటి. ఎన్నో వేల కుటుంబాలకు జీవనాధారంగా ఉంటూ, కోట్ల ప్రజానీకానికి వినోదాన్ని, ఆటవిడుపునూ అందిస్తున్న సాధనం సినిమా. భారత సినీ పరిశ్రమకు ఆద్యునిగా పేరు గాంచింది దాదాసాహెబ్ ఫాల్కే. ఆయన అసలు పేరు ధుండిరాజ్ గోవింద్ ఫాల్కే. 1896లో ఆయన బొంబాయి లోని వాట్సన్ హోటల్‌లో ఏసుక్రీస్తు చరితం పై ప్రదర్శించ బడిన సినిమాను చూడటం జరిగింది. ఆ ప్రభావంతో ఆయన హైందవ దేవతలను చూపుతూ సినిమాలు తియ్యాలన్న సంకల్పానికి వచ్చారు. 1913లో అతను తీసిన రాజా హరిశ్చంద్ర సినిమాతో మొదలైన అయన సినీ జీవితం 19 సంవత్సరాలు సాగింది. సినీ నిర్మాతగా, దర్శకుడుగా, స్క్రీన్‌ప్లే - రచయితగా ఈ కాలంలో ఆయన 95 చిత్రాలను, 26 లఘు చిత్రాలను రూపొందించారు.

**1870లో నాసిక్‌లోని త్రయం బకేశ్వర్‌లో 1870 ఏప్రిల్ 30 న ఫాల్కే జన్మించారు. బొంబాయిలోని జెజె కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్‌లో, బరోడాలోని కళాభవన్ విద్యార్థి. మంచి చిత్రకారుడు, నాటకాల్లో మేకప్ వేశారు. మంచి మెజీషియన్ కూడా... ప్రింటింగ్ ప్రెస్‌ను ఏర్పాటు చేశారు. ఆ కాలంలోనే ప్రింటింగ్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కోసం జర్మనీ వెళ్లాలనుకున్నారు. సినిమాకు సంబంధించిన వార్త ఒకటి పత్రికలో వచ్చింది. ఆయనను ఆ వార్త బాగా ఆలోచింప జేసింది. మన దేశంలో కూడా సినిమాను ఎందుకు తీయకూడదు అనే ఆలోచన ఆయనను కుదురుగా ఉండనివ్వలేదు. తన వద్ద ఉన్న డబ్బు, మిత్రుల నుంచి తీసుకున్న అప్పు, జీవిత బీమా డబ్బు మొత్తం తీసుకొని సినిమా నిర్మాణానికి సంబంధించిన పరికరాలు కొనడానికి 1912లో ఇంగ్లాండ్ వెళ్లారు. అయితే ఫాల్కేకు తాను చరిత్ర సృష్టించ బోతున్నానని తెలియదు, అదే తన జీవితాన్ని పేదరికం లోకి నెట్టివేస్తుందనీ ఊహించలేదు.**

ఫాల్కే 1913లో రాజా హరిశ్చంద్ర, ఆదే సంవత్సరం మోహినీ భస్మాసుర, సత్యవాన్ సావిత్రి (1914) శ్రీకృష్ణ జననం (1918) కాళీయ మర్దన్ (1919) నిర్మించారు. ఆ తరువాత సినిమా రంగంలో క్రమంగా వ్యాపార ధోరణి మొదలైంది. దాంతో పాల్కే పక్కకు తప్పుకున్నారు. సినిమా ప్రేమ ఆయన్ని నిలువనివ్వలేదు. తన పలుకుబడి, పరిచయాలు ఉపయోగించి నిధులు సమీకరించి 1937లో గంగావతరణ సినిమా తీశారు. నిండా మునిగి పోయారు. సినిమాను వ్యాపారంగా చూసి ఉంటే ఆయన పరిస్థితి బాగానే ఉండేది. సినిమాను విపరీతంగా ప్రేమించి దెబ్బతిన్నారు. తన వారసులను పేదరికంలోకి నెట్టేశారు. ఆయన దేశానికి తీసుకు వచ్చిన సినిమాతో సినీ వ్యాపారులు కోట్లు సంపాదించారు. పాపులారిటీని, రాజకీయాల్లో పదవులు సంపాదించారు, కానీ ఫాల్కే మాత్రం కఠిక దరిద్రంలో మరణించారు. ఆయన కుమారుడు ముంబై వీధుల్లో చిల్లర వ్యాపారిగా జీవితం గడిపారు. బాగున్న రోజుల్లో ఫాల్కే ఫోర్డ్ కారును ఉపయోగించే వారు. 1920 ప్రాంతంలో ఆ కారులోనే షూటింగ్‌కు వెళ్లేవారు. తిరిగి సినిమా తీయాలని నిర్ణయించుకున్న కాలంలో దాన్ని అమ్మేశారు. ఆ కారు పెళ్ళిళ్ల ఊరేగింపునకు ఉపయోగించారు. ఐదేళ్ల క్రితం ఆ కారు నాసిక్ డంప్ యార్డ్‌లో లభించింది. తొలి భారతీయ సినిమా కెమెరాను ఫాల్కే జర్మనీ నుంచి తెప్పించారు. అదేమైందో ఇప్పుడు ఎవరికీ తెలియదు. సినిమా నిర్మాణానికి ఎలాంటి ఏర్పాట్లు లేని కాలంలో ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి ఫాల్కే తొలి సినిమా తీశారు. ఫాల్కే భార్య సరస్వతి భారతీయ తొలి సినిమా రాజా హరిశ్చంద్ర నిర్మాణంలో కీలక భూమిక పోషించారు. ఆమెనే తొలి భారతీయ సినిమా టెక్నీషియన్. సరస్వతి, షూటింగ్ సమయంలో వెలుతురు కెమెరాపై పడకుండా బెడ్ షీట్‌ను అడ్డుగా పట్టుకుని ఉండేవారట. షూటింగ్‌కు కావలసినవన్నీ సమకూర్చేవారు. రాత్రి పూట క్యాండిల్ వెలుగులోనే ఈ సినిమాకు సంబంధించిన సాంకేతిక పనులు నిర్వహించే వారు. సినిమా బృందం 60–70 మందికి ఆమెనే వంట చేసి పెట్టేవారు. రాజా హరిశ్చంద్రలో హరిశ్చంద్రుని కుమారునిగా ఫాల్కే కుమారుడు బాలచంద్ర నటించారు. తొలి భారతీయ బాలనటుడు అతనే. శ్రీకృష్ణ జననం, కాళీయ మర్దన్‌లో బాల శ్రీకృష్ణునిగా మందాకిని నటించారు. ఆమె ఫాల్కే పెద్ద కూతురు. ఆమెనే తొలి భారతీయ బాలనటి.

**భారతీయ సినిమా రజతోత్సవ వేడుకల్లో దాదాసాహెబ్ ఫాల్కే ఒక అనామకుడిగా కూర్చోవడం చూసిన శాంతారాం ఆయన్ని గుర్తించి వేదికపైకి తీసుకు పోయి 1938లో అప్పటికప్పుడు వేదికపై ఐదువేల రూపాయల పర్స్ అంద జేశారు. ఆ డబ్బుతో ఫాల్కే తిరిగి సినిమా తీస్తాడేమోనని చాలా మంది భయపడ్డారు. ఎందుకంటే సినిమా అంటే ఆ మహనీయునికి అంత పిచ్చి. అందరూ ఒత్తిడి తెచ్చి ఆ డబ్బుతో నాసిక్‌లో ఒక ఇంటిని కొనిపించారు. అప్పటి వరకు ఫాల్కేకు సొంత ఇల్లు కూడా లేదు. ఆ ఇంటిలోనే తుది శ్వాస విడిచారు.. 90 సినిమాలను నిర్మించిన భారతీయ సినిమా పితామహుడు దరిద్రంతోనే కన్నుమూసినా, ఈ నాటికీ ఆయన జీవన మూల్యాలు ఆదర్శంగా, స్ఫూర్తి నిచ్చేవిగానే ఉన్నాయి. అయన పేరు మీద జాతీయ అవార్డుల సంరంభం ప్రతి యేటా జరుగుతున్నా, ఆయన జీవిత చరమాంకం ఎంతటి దైన్యావస్థలో గడిచిందో ఎవరూ తలచక పోవటం శోచనీయం.**


రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494


# ఆరోగ్య యవనికపై 'ఆయుష్మాన్' సంతకం

**పేదవాడి ముంగిట కార్పొరేట్ వైద్యం: ఆయుష్మాన్ భారత్ దివస్ ప్రత్యేక కథనం**

**భారతదేశ సామాజిక, ఆర్థిక ముఖచిత్రంలో ఆరోగ్య రంగం ఒక కీలకమైన పాత్రను పోషిస్తోంది. ఒక దేశాభివృద్ధికి ఆ దేశ ప్రజల ఆరోగ్యమే ప్రాధాన్యత కావాలనే 'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే ఆర్యోక్తిని అక్షరాలా నిజం చేస్తూ భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన విప్లవాత్మకమైన పథకమే 'ఆయుష్మాన్ భారత్'.**




ఏప్రిల్ 30న జరుపుకునే 'ఆయుష్మాన్ భారత్ దివస్' కేవలం ఒక వేడుక మాత్రమే కాదు, దేశంలోని ప్రతి పౌరుడికి వైద్యం ఒక హక్కుగా మారాలనే ఆశయానికి ప్రతిరూపం. 2018 సెప్టెంబరు 23న జార్ఖండ్ రాజధాని రాంచీ వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ పథకం, నేడు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వ ప్రాయోజిత ఆరోగ్య భద్రతా పథకంగా ఖ్యాతి గడించింది. వైద్యం అంటే కేవలం నయం చేయడం మాత్రమే కాకుండా, నివారణ మరియు సంరక్షణ అనే రెండు ముఖ్యమైన స్తంభాలపై ఈ పథకం నిర్మించబడింది.

**చారిత్రక నేపథ్యాన్ని పరిశీలిస్తే, భారత దేశంలో వైద్య ఖర్చులు భరించలేక ప్రతి ఏటా సుమారు ఆరు కోట్ల మంది ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువకు వెళ్తున్నట్లు అంచనాలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు, పట్టణాల్లోని అట్టడుగు వర్గాల ప్రజలు గుండె జబ్బులు, క్యాన్సర్, మూత్ర పిండాల వ్యాధుల వంటి ప్రాణాంతక వ్యాధులకు గురైనప్పుడు ఆస్తులు అమ్ముకోవడం లేదా అధిక వడ్డీలకు అప్పులు చేయడం నిత్యకృత్యంగా ఉండేది. ఈ గడ్డు పరిస్థితులను రూపుమాపే లక్ష్యంతో 'నేషనల్ హెల్త్ పాలసీ 2017' సిఫార్సుల మేరకు ఆయుష్మాన్ భారత్ ఆవిర్భవించింది. దీనిని ప్రధానంగా రెండు భాగాలుగా విభజించారు. మొదటిది, దేశవ్యాప్తంగా 1.5 లక్షల 'ఆరోగ్య మరియు సంక్షేమ కేంద్రాల' ఏర్పాటు. ఇవి కేవలం చికిత్సకే పరిమితం కాకుండా, యోగా, వ్యాయామం, గర్భిణీ స్త్రీలకు పోషకాహార సలహాలు మరియు అంటువ్యాధుల నియంత్రణ వంటి విధులను నిర్వహిస్తూ ప్రాథమిక ఆరోగ్య రక్షణను పటిష్టం చేస్తున్నాయి. రెండవది, 'ప్రధాన్ మంత్రి జన ఆరోగ్య యోజన'. ఇది ఒక బీమా రక్షణ కవచంలా నిలిచి, ప్రతి కుటుంబానికి సంవత్సరానికి ఐదు లక్షల రూపాయల వరకు నగదు రహిత చికిత్సను అందిస్తుంది.**

సాంకేతిక పరిజ్ఞానాన్ని వైద్యంతో అనుసంధానించడంలో ఆయుష్మాన్ భారత్ అద్భుతమైన ప్రతిభను కనబరిచింది.




గతంలో ఏదైనా పథకం లబ్ధి పొందాలంటే అనేక పత్రాలు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. కానీ ఈ పథకంలో 'పేపర్ లెస్' మరియు 'క్యాష్ లెస్' విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా పారదర్శకతను పెంచారు. సామా జిక ఆర్థిక కుల గణన ఆధారంగా లబ్ధిదారులను గుర్తించి, వారికి 'ఆయుష్మాన్ కార్డులు' అందజేయడం వల్ల ఎక్క డికైనా వెళ్లి వైద్యం చేయించుకునే వెసులుబాటు కలిగింది. 'పోర్టబిలిటీ' అనే అంశం ఈ పథకంలో హైలైట్ అని చెప్పవచ్చు. అంటే, ఒక రాష్ట్రానికి చెందిన వ్యక్తి దేశంలోని ఏ ఇతర రాష్ట్రంలోనైనా ఈ పథకం కింద నమోదైన ఆసుపత్రిలో ఉచితంగా చికిత్స పొందవచ్చు. వలస కూలీలకు, నిరంతరం ప్రయాణించే శ్రామిక వర్గానికి ఇది ఒక వరంలా మారింది. అధికారిక గ ణాంకాల ప్రకారం, ఇప్పటివరకు 30 కోట్లకు పైగా ఆయు ష్మాన్ కార్డులు జారీ చేయబడ్డాయి మరియు 6 కోట్లకు పైగా ఆసుపత్రి అడ్మిషన్ల ద్వారా ప్రజలు లబ్ధి పొందారు. దీని ద్వారా ప్రభుత్వం సుమారు 75,000కోట్ల రూపాయలకు పైగా ప్రజల సొంత ఖర్చులను ఆదా చేసింది.

**వైద్య రంగంలో ఉన్న అసమానతలను తొలగించడమే ఈ పథక ప్రధాన ఉద్దేశ్యం. వైద్య సదుపాయాలు కేవలం కార్పొరేట్ శక్తులకు లేదా సంపన్నులకు మాత్రమే పరిమితం కాకుండా, సామాన్యుడి ముంగిటకు చేరవేయడంలో ఆయుష్మాన్ భారత్ సఫలీకృతమైంది. ముఖ్యంగా మహిళలు, పిల్లలు మరియు వృద్ధుల ఆరోగ్యం పై ఇది సానుకూల ప్రభావం చూపింది. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు చేసే కీమోథెరపీ, గుండె శస్త్రచికిత్సలు, మోకాలి చిప్పల మార్పిడి వంటి ఖరీదైన వైద్య సేవలు ఈ పథకం పరిధిలోకి రావడంతో మధ్యతరగతి మరియు పేద కుటుంబాలు ఊపిరి పీల్చుకున్నాయి. సుమారు 1,900 రకాల వైద్య ప్రక్రియలు ఈ పథకం కింద అందుబాటులో ఉన్నాయి. ఇది కేవలం ప్రభుత్వ ఆసుపత్రులకే పరిమితం కాకుండా, వేలాది ప్రైవేట్ ఆసుపత్రులను కూడా ఇందులో భాగస్వాములను చేయడం ద్వారా రోగులకు మెరుగైన సేవల ఎంపికను కల్పించింది. ఫలితంగా ప్రైవేట్ రంగంలో కూడా ఆరోగ్య సేవల నాణ్యత పెరగడమే కాకుండా, పోటీతత్వం పెరిగి సామాన్యుడికి మేలు జరుగుతోంది.**

అయితే, ఇంతటి బృహత్తర పథకం అమలులో కొన్ని సవాళ్లు ఎదురవ్వడం సహజం. భారతదేశం వంటి అపారమైన జనాభా కలిగిన దేశంలో, ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడం ఒక పెద్ద సవాలు. మారుమూల గ్రామాల్లో నివసించే ప్రజలకు ఇప్పటికీ తమకు ఉన్న హక్కుల గురించి పూర్తిస్థాయిలో తెలియదు. అలాగే కొన్ని చోట్ల ప్రైవేట్ ఆసుపత్రులు బిల్లింగ్‌లో అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ లోపాలను సరిదిద్దడానికి ప్రభుత్వం 'నేషనల్ హెల్త్ అథారిటీ' ద్వారా కఠినమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు డేటా అనలిటిక్స్ ఉపయోగించి మోసపూరిత క్లెయిమ్‌లను గుర్తించడం, తద్వారా పారదర్శకతను కాపాడటం జరుగుతోంది. అదనంగా, 'ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్' ద్వారా ప్రతి పౌరుడికి ఒక ప్రత్యేక హెల్త్ ఐడిని సృష్టించడం ద్వారా వారి వైద్య చరిత్రను డిజిటలైజ్ చేస్తున్నారు. దీనివల్ల రోగి ఏ ఆసుపత్రికి వెళ్లినా పాత రిపోర్టులు వెంట తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండా, డాక్టర్లు వారి అనారోగ్య చరిత్రను సులభంగా తెలుసుకునే వీలు కలుగుతుంది.

**ఆయుష్మాన్ భారత్ పథకం కేవలం రోగాల నివారణకే పరిమితం కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా పరోక్షంగా ప్రభావం చూపుతోంది. ఆరోగ్యవంతుడైన పౌరుడు దేశాభివృద్ధిలో చురుగ్గా పాల్గొనగలడు. ఒక కుటుంబంలోని సంపాదించే వ్యక్తి అనారోగ్యం పాలైతే ఆ కుటుంబం మొత్తం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతుంది. ఆయుష్మాన్ భారత్ అటువంటి కుటుంబాలకు భరోసా కల్పిస్తూ, వారిని పేదరికం నుండి కాపాడుతోంది. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' అనే నినాదానికి ఆయుష్మాన్ భారత్ ఒక ప్రయోగాత్మక రూపం. భవిష్యత్తులో ఈ పథకాన్ని మరింత విస్తరించి, మధ్యతరగతి ప్రజలను కూడా పూర్తిగా కవర్ చేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అలాగే వైద్యుల సంఖ్యను పెంచడం, నర్సింగ్ సిబ్బందికి మెరుగైన శిక్షణ ఇవ్వడం మరియు మందుల లభ్యతను పెంచడం వంటి చర్యలు తీసుకుంటే భారతదేశం ఆరోగ్య రంగంలో ప్రపంచ గురువుగా ఎదగడం ఖాయం.**

ఆయుష్మాన్ భారత్ దివస్ అనేది ఆరోగ్య ప్రజాస్వామ్యానికి ఒక నిదర్శనం. రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును గౌరవిస్తూ, ప్రతి ప్రాణాన్ని కాపాడాలనే సంకల్పంతో ఈ పథకం ముందుకు సాగుతోంది. ఆరోగ్య రక్షణ అనేది దానం కాదు, అది ప్రజల హక్కు అనే చైతన్యాన్ని ఈ పథకం తీసుకువచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లోని లక్షలాది మందికి నాణ్యమైన వైద్యం అందడం ద్వారా సామాజిక న్యాయం చేకూరుతోంది. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రజలు కలిసికట్టుగా కృషి చేస్తే, 'ఆరోగ్య భారత్ – ఆనంద భారత్' అనే లక్ష్యం త్వరలోనే సిద్ధాంతం నుండి ఆచరణలోకి వస్తుంది. ఈ పథకం ద్వారా లభించే ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకున్నప్పుడే ఆయుష్మాన్ భారత్ దివస్ యొక్క అసలైన లక్ష్యం నెరవేరుతుంది.


రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494


# ప్లాస్టిక్ వద్దంటే.. కంపెనీలు ఎందుకు?

**ప్రజల మదిలో లక్ష కోట్ల ప్రశ్నలు..**

**ప్రభుత్వ తీరుపై పెరుగుతున్న సందేహాలు**

**"ప్లాస్టిక్ వాడొద్దు... పర్యావరణాన్ని కాపాడండి..." ఇది ప్రభుత్వాల ప్రచారం. పాఠశాలల నుంచి కార్యాలయాల వరకు, సభల నుంచి సామాజిక మాధ్యమాల వరకు ఇదే సందేశం. కానీ అదే సమయంలో దేశవ్యాప్తంగా వేలాది ప్లాస్టిక్ తయారీ సంస్థలు యథావిధిగా కొనసాగుతుండటం ప్రజల్లో తీవ్రమైన సందేహాలకు దారితీస్తోంది. నిజంగా ప్లాస్టిక్ అంత ప్రమాదకరమైతే... దానిని తయారు చేసే కంపెనీలను ఎందుకు పూర్తిగా రద్దు చేయడం లేదు? ప్రజల ఆరోగ్యానికి హానికరమైతే... పరిశ్రమలకు ఎందుకు మినహాయింపులు? ఈ ప్రశ్నలు ఇప్పుడు సామాన్యుడి మనసులోనే కాదు... సమాజం మొత్తం ఆలోచిస్తున్న అంశాలుగా మారాయి.**



ఇక్కడే ప్రభుత్వ విధానంలోని ప్రధాన వైరుధ్యం కనిపిస్తోంది. వినియోగదారుడిపై బాధ్యత మోపుతూ "వాడొద్దు" అని చెబుతున్న పాలక వ్యవస్థ... ఉత్పత్తి వ్యవస్థపై మాత్రం పూర్తిస్థాయి కఠినత్వం ఎందుకు చూపడం లేదు? ఒకవైపు ప్లాస్టిక్ సంచులు పట్టుకున్న చిన్న వ్యాపారిపై జరిమానా... మరోవైపు భారీ స్థాయిలో ప్లాస్టిక్ ఉత్పత్తి చేస్తున్న కంపెనీలకు నియంత్రిత అనుమతులు. ఈ ద్వంద్వ వైఖరి ప్రజల్లో అనుమానాలకు కారణం కాక మానదు. ప్రభుత్వ వాదన ప్రకారం అన్ని రకాల ప్లాస్టిక్‌పై ఒకేసారి నిషేధం సాధ్యం కాదు. దేశ ఆర్థిక వ్యవస్థలో ప్లాస్టిక్ పరిశ్రమ కీలక భాగం. ప్యాకేజింగ్, వైద్యం, వ్యవసాయం, రవాణా వంటి అనేక రంగాల్లో దీని వినియోగం ఉంది. లక్షలాది ఉద్యోగాలు కూడా దీనిపైనే ఆధారపడి ఉన్నాయి. అందుకే పూర్తి నిషేధం కాకుండా దశలవారీ నియంత్రణ మార్గాన్ని ఎంచుకున్నామని చెబుతోంది. కానీ ప్రజల ప్రశ్న మరింత సూటిగా ఉంది – "ప్రమాదం అని తెలిసినా... లాభాల కోసం కొనసాగించడమేనా?" ఇది కేవలం ఆర్థిక అంశం మాత్రమే కాదు... ప్రజారోగ్యం, పర్యావరణ భవిష్యత్తుతో ముడిపడిన విషయం. ప్లాస్టిక్ కాలుష్యం ప్రభావం ఇప్పుడు చెత్తకుప్పల వరకే పరిమితం కాదు. గాలి, నీరు, ఆహారం ద్వారా సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు మన శరీరాల్లోకి చేరుతున్నాయి. క్యాన్సర్ నుంచి గుండెజబ్బుల వరకు అనేక ఆరోగ్య సమస్యలతో సంబంధం ఉన్నట్లు ప్రపంచవ్యాప్తంగా హెచ్చరికలు వస్తున్నాయి. అయినా కూడా ఉత్పత్తి వ్యవస్థలో పెద్ద మార్పు నెమ్మదిగా ఉండటం ప్రజలను కలవరపెడుతోంది. ఇక్కడ ప్రభుత్వాల అసలు పరీక్ష అమలులోనే ఉంది. కేవలం ప్రచారాలు కాదు... నిజమైన విధాన మార్పు కావాలి. చిన్న వ్యాపారులపై చర్యలు తీసుకోవడం మాత్రమే కాదు... పెద్ద కంపెనీలకు కూడా సమాన బాధ్యత విధించాలి. ప్రత్యామ్నాయ ఉత్పత్తులకు భారీ ప్రోత్సాహం, పర్యావరణహిత పరిశ్రమలకు సబ్సిడీలు, ప్లాస్టిక్ ఉత్పత్తిపై కఠిన పరిమితులు లేకపోతే "ప్లాస్టిక్ వద్దు" అనే నినాదం ప్రజలకు నమ్మశక్యంగా అనిపించదు. ప్రజలు అడుగుతున్నది ఒక్కటే.."ప్రాణాలకు హానికరమైతే పూర్తిగా ఆపండి... అవసరమైతే నిజం చెప్పండి... కానీ బాధ్యతను కేవలం ప్రజలపై మోపొద్దు." ప్రభుత్వం నిజంగా పర్యావరణ పరిరక్షణ కోరుకుంటే... ప్రచారానికి మించి నిర్ణయాత్మక ధైర్యం చూపాలి. లేకపోతే ప్లాస్టిక్‌పై యుద్ధం పేరుతో ప్రజలపై నియమాలు, పరిశ్రమలపై మినహాయింపులు అనే భావన మరింత బలపడుతుంది. చివరికి ఇది కేవలం ప్లాస్టిక్ గురించిన చర్చ కాదు... పాలనలో పారదర్శకత గురించిన ప్రశ్న. ప్రజలు ఇప్పుడు నినాదాలు కాదు... నిజాయితీతో కూడిన సమాధానాలు కోరుతున్నారు.

- కాలగిరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్



# భగ్గుమన్న బంగారం ధరలు

**హైదరాబాద్, ఏప్రిల్ 29:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న అనిశ్చిత పరిస్థితులు అంతర్జాతీయ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో బంగారం ధరలు మరోసారి ఎగబాకాయి. పెట్టుబడిదారులు సేఫ్ హేవెన్‌గా భావించే బంగారం వైపు మొగ్గు చూపడంతో ధరలు పెరుగుతున్నాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. మంగళవారం ముగింపు సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,50,930 వద్ద ట్రేడ్ కాగా, 22 క్యారెట్ల బంగారం రూ.1,38,350, 18 క్యారెట్ల బంగారం రూ.1,13,200 వద్ద నమోదైంది. అయితే బుధవారం ఉదయం మరింత పెరుగుదల కనిపించింది. ఉదయం 10 గంటల ప్రాంతంలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ.1,51,370కి చేరగా, 22 క్యారెట్ల బంగారం రూ.1,38,750, 18 క్యారెట్ల బంగారం రూ.1,13,530 వద్ద ట్రేడ్ అవుతోంది. దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరలు దాదాపు ఒకే స్థాయిలో కొనసాగుతున్నాయి. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ముంబై, బెంగళూరు నగరాల్లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,51,370గా ఉండగా, ఢిల్లీలో రూ.1,51,530, చెన్నై, మధురై, కోయంబత్తూరులో రూ.1,52,190 వరకు నమోదైంది. ఈ పెరుగుదలకు ప్రధాన కారణం అంతర్జాతీయ పరిస్థితులే. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, గ్లోబల్ ఎకానమీపై అనిశ్చితి, డాలర్ మార్పిడి విలువల్లో ఒడిదుడుకులు ఇవి కలిసి బంగారం ధరలను ప్రభావితం చేస్తున్నాయి. భవిష్యత్తులో కూడా పరిస్థితులు స్థిరపడే వరకు ధరల్లో హెచ్చుతగ్గులు కొనసాగవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మొత్తానికి, ప్రస్తుతం బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి ధరలు భారంగా మారుతున్నాయి. అయితే దీర్ఘకాలిక పెట్టుబడిగా చూస్తే బంగారం ఇంకా సురక్షితమైన ఎంపికగానే కొనసాగుతుందని

# ఓపెన్ ఏఐపై మస్క్ ఆరోపణలు

## అమెరికా కోర్టులో ఆసక్తికర విచారణ

**వాషింగ్టన్, ఏప్రిల్ 29 :** టెక్ ప్రపంచంలో తీవ్ర చర్చకు దారితీసిన ఓపెన్ ఏఐపై ఎలాన్ మస్క్ దాఖలు చేసిన కేసు విచారణ అమెరికా కోర్టులో ప్రారంభమైంది. ఈ కేసు తొలి రోజు విచారణలో మస్క్ స్వయంగా హాజరై సంస్థపై కీలక ఆరోపణలు చేశారు. మొదట లాభాపేక్ష రహితంగా మానవాళి ప్రయోజనాల కోసం సంస్థను ప్రారంభించామని చెప్పి, తర్వాత పూర్తిగా వాణిజ్య దిశగా మళ్లిందని ఆయన ఆరోపించారు. మస్క్ మాట్లాడుతూ, కృత్రిమ మేధ రంగంలో పెద్ద సంస్థలకు ప్రత్యామ్నాయంగా ప్రజల ప్రయోజనాలను కాపాడే స్వతంత్ర వేదిక అవసరమనే ఉద్దేశంతో తాను ఓపెన్ ఏఐ స్థాపనకు సహకరించానని చెప్పారు. ముఖ్యంగా +శీశీస్త్రశ్రీవ వంటి దిగ్గజాలకు సమతూకంగా ఉండే సంస్థగా దీనిని ఊహించామని తెలిపారు. అందుకే శామ్ ఆల్ట్‌మన్తో కలిసి ముందుకు వచ్చినట్లు కోర్టులో వెల్లడించారు. “నాకు కావాలంటే నేనే ఒక పెద్ద కార్పొరేట్ ఏఐ సంస్థను ప్రారంభించగలిగేవాడిని. కానీ నా ఉద్దేశం అది కాదు. మానవాళికి ఉపయోగపడేలా, పారదర్శకంగా పనిచేసే సంస్థ కావాలనుకున్నాను. ఇప్పుడు సంస్థ పూర్తిగా లాభాల చుట్టూ తిరుగుతోంది. ఇది పెట్టుబడిదారులకు ఇచ్చిన హామీలకు విరుద్ధం” అని మస్క్ పేర్కొన్నారు. కృత్రిమ మేధ అభివృద్ధి వేగం తనను ఆందోళనకు గురి చేస్తోందని కూడా మస్క్ తెలిపారు. మరికొన్ని సంవత్సరాల్లో ఏఐ మానవ మేధస్సును మించిపోవచ్చని, దాని ప్రభావం సమాజంపై తీవ్రంగా ఉండవచ్చని హెచ్చరించారు. ఏఐపై తన ఆందోళనలు కొత్తవి కావని, చాలాకాలంగా ఇదే విషయంపై హెచ్చరిస్తున్నానని ఆయన గుర్తు చేశారు. 2015లో మస్క్, శామ్ ఆల్ట్‌మన్ మరియు మరికొందరు కలిసి ఓపెన్ ఏఐను లాభాపేక్ష రహిత సంస్థగా ప్రారంభించారు. అయితే 2018లో మస్క్ బోర్డు నుంచి వైదొలిగారు. అనంతరం 2019లో భారీ పెట్టుబడులు సమీకరించేందుకు సంస్థ అనుబంధ వ్యాపార నిర్మాణాన్ని తీసుకురావడంతో వివాదం మొదలైంది. ఆ మార్పులు సంస్థ అసలు లక్ష్యాలకు విరుద్ధమని పేర్కొంటూ మస్క్ కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఈ కేసు కేవలం ఒక సంస్థ భవిష్యత్తుకే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఏఐ సంస్థల పారదర్శకత, బాధ్యత, లాభాపేక్ష మధ్య సమతుల్యతపై పెద్ద చర్చకు దారితీసే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ విచారణలో వచ్చే తీర్పు భవిష్యత్తులో కృత్రిమ మేధ రంగంపై ప్రభావం చూపే




# ఒపెక్ నుంచి యూఏఈ వైదొలగింపు.. భారత్‌కు లాభాలేనా?

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29 :** ప్రపంచంలో అతిపెద్ద చమురు ఉత్పత్తి కూటమి అయిన ఒపెక్ నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ బయటకు రావాలనే నిర్ణయం అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో చర్చనీయాంశంగా మారింది. మే 1 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానుండగా, దీని ప్రభావం చమురు ఉత్పత్తి, ధరలపై ఎలా ఉంటుందన్న దానిపై ఆసక్తి నెలకొంది. ఇప్పటి వరకు ఒపెక్ నియంత్రణలో ఉత్పత్తిని పరిమితం చేస్తూ వచ్చిన యూఏఈ, ఇకపై స్వేచ్ఛగా చమురు ఉత్పత్తిని పెంచే అవకాశం ఉంది. దీంతో గ్లోబల్ మార్కెట్‌లో సరఫరా పెరిగి ధరలు తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా దిగుమతులపై ఆధారపడే భారతదేశం వంటి దేశాలకు ఇది శుభవార్తగా భావిస్తున్నారు. ప్రస్తుతం భారత్ ముడి చమురు అవసరాల్లో సుమారు 10 శాతం యూఏఈ నుంచే దిగుమతి అవుతోంది. ఒపెక్ పరిమితులు లేకుండా యూఏఈ ఉత్పత్తిని పెంచితే, భారత్‌కు మరింత చమురు తక్కువ ధరలకు అందే అవకాశం ఉంది. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలపై ఒత్తిడి తగ్గే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇక వ్యూహాత్మకంగా కీలకమైన




హోర్ముజ్ జలసంధి పరిస్థితులు కూడా ఇక్కడ కీలక పాత్ర పోషిస్తాయి. ఈ మార్గం పూర్తిగా సాధారణ స్థితికి వస్తే ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాలు మరింత పెరిగే అవకాశం ఉంది. అదే సమయంలో యూఏఈ భారీగా ఉత్పత్తిని పెంచితే, ధరలు మరింత తగ్గే పరిస్థితి ఏర్పడవచ్చు. అయితే తక్షణ ప్రభావం పెద్దగా కనిపించకపోవచ్చు. గ్లోబల్ జియోపాలిటికల్ పరిస్థితులు, డిమాండ్–సరఫరా సమీకరణాలు స్పష్టమయ్యే వరకు మార్కెట్ స్థిరపడటానికి కొంత సమయం పట్టొచ్చు. అయినప్పటికీ దీర్ఘకాలంలో ఈ పరిణామం భారత్‌కు ఇంధన భద్రత పరంగా లాభదాయకంగా మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

# లాభాల్లో ముగిసిన మార్కెట్లు

**ముంబై, ఏప్రిల్ 29 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరగడంతో ఇన్వెస్టర్లలో ఆందోళన నెలకొన్నప్పటికీ, దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాలతో ముగిశాయి. రోజంతా ఉత్సాహంగా సాగిన ట్రేడింగ్ చివరి గంటలో మందగించినా, కీలక షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు గ్రీన్‌లోనే నిలిచాయి.ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 609.45 పాయింట్లు పెరిగి 77,496.36 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 181.95 పాయింట్లు లాభపడి 24,177.65 వద్ద ముగిసింది. అయితే ఇంట్రాడే గరిష్ఠ స్థాయిల నుంచి సూచీలు కొంత వెనక్కి తగ్గడం గమనార్హం. అమెరికా–ఇరాన్ మధ్య చర్చలు నిలిచిపోవడం, అలాగే ఒపెక్ నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వైదొలగనున్నట్లు ప్రకటించడంతో గ్లోబల్ మార్కెట్లలో సరఫరాపై ఆందోళనలు పెరిగాయి. దీంతో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 114.60 డాలర్లకు చేరి 3 శాతానికి పైగా పెరిగింది. ఈ పరిణామం మార్కెట్ల జోరుకు కొంత బ్రేక్ వేసింది. టెక్నికల్ విశ్లేషణ ప్రకారం నిఫ్టీకి 24,200 వద్ద కీలక నిరోధకం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ సూచీ కిందకు వస్తే 24,000--24,100 స్థాయిలు మద్దతుగా నిలిచే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. కీలక షేర్లలో ఐటీసీ, టెక్ మహీంద్రా, మారుతీ సుజుకీ లలో కొనుగోళ్లు కనిపించడంతో మార్కెట్లు లాభాల్లో నిలిచాయి. బ్రాడర్ మార్కెట్లు మాత్రం మిశ్రమంగా స్పందించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ స్వల్పంగా నష్టపోగా, స్మాల్‌క్యాప్ సూచీ 0.65 శాతం లాభపడింది. రంగాల వారీగా చూస్తే ఎఫ్ఎంసీజీ, రియల్టీ షేర్లు రాణించగా, కన్స్ట్రక్షన్, మీడియా రంగాలు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. పెరుగుతున్న చమురు ధరలు, అలాగే అమెరికా ఫెడ్ పాలసీ నిర్ణయాలు సమీప భవిష్యత్తులో మార్కెట్ దిశను ప్రభావితం చేసే అవకాశం ఉందని విశ్లేషకులు



# పట్టణ ప్రయాణికులకు కొత్త ఈ-మోపెడ్



**హైదరాబాద్, ఏప్రిల్ 29 :** పట్టణ ప్రాంతాల్లో రోజువారీ చిన్న దూర ప్రయాణాలకు అనువుగా ప్రముఖ విద్యుత్ వాహన తయారీ సంస్థ మోటోవోల్ట్ కొత్త మోపెడ్‌ను ప్రవేశపెట్టింది. ‘అర్బన్’ పేరుతో వచ్చిన ఈ వాహనం సైకిల్ తరహా రూపంతో కనిపించినా, స్కూటర్‌లా సౌకర్యాలు అందించడం విశేషం. ఈ మోపెడ్‌లో శక్తివంతమైన లిథియం అయాన్ బ్యాటరీను అమర్చారు. వాహనం నుంచి బ్యాటరీను వేరు చేసి ఇంట్లోనే సులభంగా ఛార్జ్ చేసుకోవచ్చు. ఒకసారి పూర్తి ఛార్జ్ చేస్తే సుమారు 120 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చని సంస్థ తెలిపింది. తక్కువ వేగం కేటగిరీలో ఉండటంతో ఈ వాహనాన్ని నడపడానికి డ్రైవింగ్ లైసెన్స్ లేదా ఆర్టీఓ నమోదు అవసరం లేదు. దీనివల్ల విద్యార్థులు, మహిళలు, వృద్ధులు సైతం సులభంగా వినియోగించుకోవచ్చు. ప్రత్యేకంగా పెడల్ సదుపాయం ఉండటం ఈ వాహనానికి మరింత ఉపయోగకరంగా మారింది. ఒకవేళ బ్యాటరీ శక్తి తగ్గినా, సైకిల్‌లా పెడల్స్ తొక్కుకుంటూ ప్రయాణం కొనసాగించవచ్చు. పెడల్ సహాయక విధానం వల్ల తక్కువ శ్రమతోనే ముందుకు కదిలేలా రూపకల్పన చేశారు. అదనంగా ఆధునిక సాంకేతికతను కూడా ఇందులో పొందుపరిచారు. మొబైల్ ఫోన్‌తో అనుసంధానం చేసుకునే సదుపాయం, డిజిటల్ ప్రదర్శన పరికరం, వివిధ ప్రయాణ విధానాలు వంటి ఫీచర్లు ఇందులో ఉన్నాయి. దృఢమైన నిర్మాణంతో పట్టణ రోడ్లకు అనుకూలంగా ఈ వాహనాన్ని రూపొందించారు. ఈ మోపెడ్ ధర సుమారు యాభై వేల నుంచి యాభై ఐదు వేల రూపాయల మధ్య ఉండే అవకాశముందని తెలుస్తోంది. తక్కువ ఖర్చుతో, పర్యావరణానికి మేలు చేసే ప్రయాణం కోరుకునే వారికి ఇది సరైన ఎంపికగా మారే అవకాశం ఉంది.

# క్రెడిట్ కార్డు బిల్లులకు మూడు రోజుల గడువు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29):** క్రెడిట్ కార్డులు వినియోగించే వారికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక ఊరట కలిగించింది. క్రెడిట్ కార్డు బిల్లుల చెల్లింపులో ఆలస్యమైతే వెంటనే జరిమానాలు విధించకుండా మూడు రోజుల గ్రేస్ పీరియడ్ ఇవ్వాలని కొత్త నిబంధనలు జారీ చేసింది. ఈ నిర్ణయం ప్రకారం, బిల్లు గడువు తేదీ ముగిసిన తర్వాత కూడా మూడు రోజుల వరకు వినియోగదారులకు అదనపు సమయం లభిస్తుంది. ఈ సమయంలో ఎలాంటి ఆలస్యపు రుసుములు లేదా ఇతర ఛార్జీలు విధించరాదు. మూడు రోజుల తర్వాత మాత్రమే ఆలస్యంగా చెల్లించినట్లుగా పరిగణించి జరిమానాలు విధించాల్సి ఉంటుంది. అంతేకాకుండా, లేట్ ఫీజులను లెక్కించే విధానంలో కూడా మార్పులు తీసుకొచ్చింది. గడువు దాటిన మొత్తం బకాయిపై మాత్రమే ఛార్జీలు విధించాలి గానీ, మొత్తం బిల్లు మొత్తంపై కాదు. దీనివల్ల వినియోగదారులపై పడే ఆర్థిక భారం తగ్గే అవకాశం ఉంది. ఇప్పటివరకు అనేక బ్యాంకులు గడువు తేదీ ముగిసిన వెంటనే లేట్ ఫీజులు విధించేవి. దీనివల్ల వినియోగదారులు అదనపు భారాన్ని భరించాల్సి వచ్చేది. కొత్త నిబంధనలతో ఈ సమస్యకు కొంతవరకు పరిష్కారం లభించనుంది. ఈ మార్పులు వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటం, చెల్లింపుల విధానంలో పారదర్శకత తీసుకురావడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్బీఐ పేర్కొంది.




# భారీగా పడిపోయిన చికెన్ ధరలు



## వినియోగదారులకు ఊరట

**హైదరాబాద్, ఏప్రిల్ 29:** గత కొన్ని రోజులుగా ఆకాశాన్ని తాకిన చికెన్ ధరలు ఒక్కసారిగా భారీగా తగ్గడంతో మాంసాహారులకు పెద్ద ఊరట లభించింది. ఇటీవల కిలో రూ.400 వరకు చేరిన ధరలు ఇప్పుడు గణనీయంగా పడిపోయి సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో చికెన్ మార్కెట్‌లో ధరలు స్పష్టంగా తగ్గుముఖం పట్టాయి. ఫామ్ రేటు కేవలం రూ.105 వద్ద ఉండగా, రిటైల్ మార్కెట్‌లో లైవ్ బర్డ్ రూ.132 ప్రాంతంలో లభిస్తోంది. స్కిన్‌లెస్ చికెన్ ధరలు కూడా రూ.218 నుంచి రూ.230 మధ్య విక్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో కిలో రూ.200కే చికెన్ దొరకడం విశేషంగా మారింది. ఈ ధరల తగ్గుదలకు ప్రధాన కారణం వేసవి కాల ప్రభావమేనని వ్యాపారులు చెబుతున్నారు. ఎండలు పెరగడంతో చికెన్ వినియోగం కొంత తగ్గుతుంది. అదే సమయంలో కోళ్ల ఉత్పత్తి పెరగడంతో మార్కెట్‌లో సరఫరా అధికమవుతుంది. దాంతో డిమాండ్ కంటే సరఫరా ఎక్కువై ధరలు సహజంగానే తగ్గుతాయి. అదనంగా, కోళ్ల దాణా ఖర్చులు, రవాణా పరిస్థితులు, ప్రాంతాలవారీగా వినియోగం వంటి అంశాలు కూడా ధరలపై ప్రభావం చూపుతున్నాయి. అందుకే ఒక్కో ప్రాంతంలో ధరల్లో స్వల్ప మార్పులు కనిపిస్తున్నాయి. ధరలు సగానికి పైగా తగ్గిపోవడంతో వినియోగదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వీకెండ్‌లలో మాంసాహారం వండుకునే వారికి ఇది మంచి అవకాశం. మార్కెట్ పరిస్థితులను బట్టి రాబోయే రోజుల్లో ధరలు మరింత తగ్గే అవకాశముందని



# కాంబ్లీ యాడ్‌పై వివాదం

**ముంబై, ఏప్రిల్ 29 :** మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ నటించిన కొత్త ఐస్‌క్రీమ్ ప్రకటన ఇప్పుడు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీసింది. అనారోగ్య సమస్యల తర్వాత ఆయన మళ్లీ ప్రజల ముందుకు రావడం ఒక వైపు అభినందనలు పొందుతుండగా, ఆ యాడ్ కాన్సెప్ట్‌పై మాత్రం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రకటనను డిన్‌షాస్ ఐస్‌క్రీమ్ కోసం రూపొందించారు. "జీవితంలో తక్కువ పొందిన వారు, ఎక్కువకు అర్హులు" అనే భావనతో ఈ యాడ్‌ను రూపొందించగా, ఐస్‌క్రీమ్ కోన్‌లో చాక్లెట్ భాగాన్ని ఎక్కువగా చూపించడం ద్వారా సందేశాన్ని ఇవ్వడానికి ప్రయత్నించారు. కాంబ్లీ జీవితంలోని ఎత్తుపల్లాలను ప్రతిబింబిస్తూ, చివర్లో ఆనందాన్ని చూపించేలా కథనం రూపొందించారు. ప్రకటన సంస్థ మాత్రం ఇది కాంబ్లీ పట్టుదల, తిరిగి లేచే ధైర్యాన్ని చూపించే పాజిటివ్ క్యాంపెయిన్ అని చెబుతోంది. అయితే నెటిజన్లు మాత్రం భిన్నంగా స్పందిస్తున్నారు. కాంబ్లీ అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు వంటి వ్యక్తిగత సమస్యలను వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించడం సరైనదా అని ప్రశ్నిస్తున్నారు. కొంతమంది ఈ యాడ్‌ను "సానుభూతి మార్కెటింగ్"గా విమర్శిస్తుండగా, మరికొందరు కాంబ్లీకి మద్దతుగా నిలుస్తున్నారు. ఆయన మళ్లీ కెమెరా ముందుకు రావడం సంతోషకరమని, దీన్ని నెగెటివ్‌గా చూడకూడదని అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి ఈ ప్రకటన సోషల్ మీడియాలో చర్చకు దారి తీసి, సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాన్ని ప్రకటనల్లో ఉపయోగించే విధానంపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తింది.



# సల్మాన్‌కు ఫెరీరా 'సారీ'

**ముల్లాన్‌పూర్, ఏప్రిల్ 29 :** రాజస్థాన్ రాయల్స్ ఐపీఎల్‌లో తమ జోరు కొనసాగిస్తూ పంజాబ్ కింగ్స్‌పై అద్భుత విజయాన్ని నమోదు చేసింది. 223 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి ఈ సీజన్‌లో పంజాబ్‌కు తొలి ఓటమిని మిగిల్చింది. ఈ విజయానికి దక్షిణాఫ్రికా ఆటగాడు డోనోవన్ ఫెరీరా ప్రధాన కారణంగా నిలిచాడు. కేవలం 26 బంతుల్లో 52 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచిన అతడు జట్టుకు సునాయాస విజయాన్ని అందించాడు. మ్యాచ్ అనంతరం రాజస్థాన్ రాయల్స్ పోస్ట్ చేసిన వీడియో ఆసక్తికరంగా మారింది. అందులో ఫెరీరా బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్కు సరదాగా క్షమాపణలు చెబుతూ కనిపించాడు. ఇది 2014లో చేసిన ఒక ట్వీట్‌కు సంబంధించిన రిఫరెన్స్. అప్పట్లో పంజాబ్ జట్టు గురించి "జింటా టీమ్ గెలిచిందా?" అంటూ సల్మాన్ చేసిన ట్వీట్ ప్రతి మ్యాచ్ సమయంలో వైరల్ అవుతూ ఉంటుంది. అదే విషయాన్ని గుర్తు చేసుకుంటూ ఫెరీరా "సారీ భాయ్.. ఈరోజు కాదు" అంటూ నవ్వుతూ స్పందించాడు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానులను ఆకట్టుకుంటోంది. మ్యాచ్ విజయం మాత్రమే కాకుండా, ఇలాంటి సరదా క్షణాలు కూడా అభిమానులకు మంచి ఎంటర్‌టైన్‌మెంట్ ఇస్తున్నాయి.



# వైభవ్‌పై అర్ష్‌దీప్ సరదా కామెంట్స్

**ముల్లాన్‌పూర్, ఏప్రిల్ 29 :** పంజాబ్ కింగ్స్ స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్, యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్‌పై చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడిన విషయం తెలిసిందే. కేవలం 16 బంతుల్లోనే 43 పరుగులు చేసి రాజస్థాన్‌కు మెరుపు ఆరంభం ఇచ్చాడు. ముఖ్యంగా అర్ష్‌దీప్ వేసిన ఓవర్‌లో భారీ షాట్లు కొట్టి మ్యాచ్ మూడ్ మార్చేశాడు. మ్యాచ్ అనంతరం రాజస్థాన్ రాయల్స్ షేర్ చేసిన వీడియోలో అర్ష్‌దీప్ సరదాగా స్పందించాడు. "వైభవ్ బయట 'భయ్యా భయ్యా' అంటూ చాలా గౌరవంగా మాట్లాడుతాడు. కానీ క్రీజులోకి వచ్చాక ఆ మర్యాద పక్కన పెట్టి బాదేశాడు. నా ఓవర్‌లో 35 పరుగులు కొట్టాడు" అంటూ నవ్వుతూ చెప్పాడు. ఇదే సమయంలో యశస్వి జైస్వాల్ కూడా వైభవ్‌ను ప్రశంసించాడు. "అతనితో కలిసి బ్యాటింగ్ చేయడం అద్భుత అనుభవం. బంతిని హిట్ చేసే తీరు చూసి ఆశ్చర్యంగా ఉంటుంది. అతనిలో ఉన్న టాలెంట్ అసాధారణం" అని వ్యాఖ్యానించాడు. ఈ మ్యాచ్‌తో వైభవ్ సూర్యవంశీ యువ సెన్సేషన్‌గా మారిపోగా, అతని ఆటతీరుపై ప్రత్యర్థి ఆటగాళ్లే ప్రశంసలు కురిపించడం విశేషం.



# పరుగుల సునామీ!

## ముంబైపై సన్‌రైజర్స్ సంచలన విజయం

- 6 వికెట్ల తేడాతో ఆడుతూపాడుతూ గెలుపు
- 244 పరుగుల టార్గెట్ ను ఊదేసిన బ్యాటర్లు
- కదం తొక్కిన ట్రావిస్ హెడ్, క్లాసెన్, అభిషేక్
- వృథా అయిన ముంబై బ్యాటర్ రికెల్టన్ శతకం



**ముంబై:** వాంఖడే స్టేడియం వేదికగా బుధవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్ అభిమానులకు పరుగుల పండుగను పంచింది. సన్ రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు ముంబై ఇండియన్స్ బౌలర్లను ఊచకోత కోశారు. కొండంత లక్ష్యాన్ని కూడా ఆడుతూపాడుతూ ఛేదించి సంచలన విజయాన్ని అందుకున్నారు. ఇరు జట్ల బ్యాటర్లు సిక్సర్లు, బౌండరీలతో విరుచుకుపడటంతో స్టేడియం హోరెత్తిపోయింది.

### రికెల్టన్ శివతాండవం..



టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న ముంబై జట్టు నిర్ణీత ఇరవై ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి ఏకంగా 243 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ ర్యాన్ రికెల్టన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. సన్ రైజర్స్ బౌలర్లకు చుక్కలు చూపిస్తూ కేవలం 55 బంతుల్లోనే అజేయంగా 123 పరుగులు చేసి అద్భుత శతకం నమోదు చేశాడు. అతనికి తోడుగా విల్ జాక్స్ 22 బంతుల్లో 46 పరుగులు, కెప్టెన్ హార్దిక్ పాండ్యా 15 బంతుల్లో 31 పరుగులు చేశారు. సన్ రైజర్స్ బౌలర్లలో ప్రఫుల్ హింగే నాలుగు ఓవర్లలో 54 పరుగులిచ్చి రెండు వికెట్లు తీయగా.. ఇషాన్ మలింగ, నితీష్ కుమార్ రెడ్డి తలో వికెట్ పడగొట్టారు.

### అదరగొట్టిన హెడ్, క్లాసెన్..

244 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టు ఏమాత్రం బెదరలేదు. ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ ముంబై బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. హెడ్ కేవలం 30 బంతుల్లోనే 76 పరుగులతో సునామీ సృష్టించగా, అభిషేక్ 24 బంతుల్లో 45 పరుగులు చేశాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన హెన్రిచ్ క్లాసెన్ అదే జోరు కొనసాగించాడు. 30 బంతుల్లో 65 పరుగులతో అజేయంగా నిలిచి మరో ఎనిమిది బంతులు మిగిలి ఉండగానే జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. మొత్తంగా 18.4 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 249 పరుగులు చేసిన హైదరాబాద్ సగర్వంగా గెలుపొందింది. ముంబై బౌలర్లలో అల్లాహ్ గజన్ఫర్ రెండు వికెట్లు తీశాడు. హార్దిక్ పాండ్యా, ట్రెంట్ బౌల్ట్ చెరో వికెట్ దక్కించుకున్నారు. ముంబై భారీ స్కోరు చేసినా బౌలర్లు విఫలం కావడంతో పరాజయం తప్పలేదు.



# డ్రెస్సింగ్ రూమ్‌లో ఈ-సిగరెట్?

### రియాన్ పరాగ్‌పై బీసీసీఐ సీరియస్



ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ అనూహ్య వివాదంలో చిక్కుకున్నాడు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్ సందర్భంగా డ్రెస్సింగ్ రూమ్‌లో ఈ-సిగరెట్ వాడుతున్నట్లు కనిపించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ వ్యవహారం పెద్ద చర్చకు దారి తీసింది. ఈ ఘటనపై బీసీసీఐ సీరియస్‌గా స్పందించినట్లు సమాచారం. వైరల్ వీడియో నేపథ్యంలో పరాగ్ నుంచి వివరణ కోరిన బీసీసీఐ, అతని సమాధానం ఆధారంగా తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనుందని తెలుస్తోంది. భారతదేశంలో ఈ-సిగరెట్లపై నిషేధం అమల్లో ఉన్న నేపథ్యంలో, ఈ ఘటన కేవలం ఐపీఎల్ క్రమశిక్షణ పరమైన అంశం మాత్రమే కాకుండా చట్టపరమైన కోణంలో కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. 2019లో అమల్లోకి వచ్చిన ఎలక్ట్రానిక్ సిగరెట్ల నిషేధ చట్టం ప్రకారం.. ఈ-సిగరెట్ల తయారీ, విక్రయం, నిల్వ, వినియోగం, ప్రచారం నిషేధితంగా పరిగణించబడుతుంది. నిబంధనలు ఉల్లంఘించినట్లయితే జైలు శిక్షతో పాటు భారీ జరిమానా విధించే అవకాశముంది. దీంతో పరాగ్ వ్యవహారం మరింత సున్నితంగా మారింది. ఐపీఎల్ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. కొంతమంది ఆటగాళ్లు వ్యక్తిగతంగా ఈ-సిగరెట్లు వినియోగించినా, డ్రెస్సింగ్ రూమ్ వంటి ప్రదేశంలో కెమెరాల మధ్య అలాంటి చర్యలు అత్యంత నిర్లక్ష్యంగా భావిస్తున్నారు. ముఖ్యంగా జట్టు నాయకుడిగా ఉన్న పరాగ్ నుంచి మరింత బాధ్యతాయుత ప్రవర్తన ఆశిస్తారని క్రీడా వర్గాలు చెబుతున్నాయి. ఈ ఘటనతో మరోసారి డ్రెస్సింగ్ రూమ్ గోప్యత అంశం కూడా చర్చకు వచ్చింది. సీజన్ ఆరంభానికి ముందు కెప్టెన్లు డ్రెస్సింగ్ రూమ్‌లలో కెమెరాల ఉనికి పై అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ, ప్రసార వ్యవస్థపై నిర్ణయం బ్రాడ్‌కాస్టర్లదేనని బీసీసీఐ అప్పట్లో స్పష్టం చేసింది. ఇప్పుడు పరాగ్ ఘటనతో క్రమశిక్షణ, గోప్యత, చట్టబద్ధత అంశాలు ఒకేసారి చర్చనీయాంశంగా మారాయి.




# పాత్ర కోసం రష్మిక రిస్క్

పాత్ర కోసం ఎంత రిస్క్ అయినా తీసుకునే కథానాయికల్లో రష్మిక ముందు వరుసలో ఉంటారు. తాజాగా ఆమె మరోసారి నటనపై తనకున్న నిబద్ధతను చాటుకున్నారు. తాను నటిస్తోన్న 'మైసా' కోసం మునుపెన్నడూ లేనివిధంగా కష్టపడుతున్నారు. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో రష్మిక గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం ఆమె చేసిన సవాలుతో కూడిన స్టంట్స్ గురించి 'మైసా' డైరెక్టర్ రవీంద్ర పుల్లె తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. రష్మిక పోషిస్తున్న పాత్ర పేరు 'మైసా'. చాలా ప్రభావవంతమైన పాత్ర. ఆమె ప్రదర్శించే కోపం, ఆవేశం ఈ సినిమాకు హైలైట్. ఇటీవలే కేరళలోని అతిరపల్లి జలపాతం వద్ద ఒక క్లిష్టమైన యాక్షన్ సీన్ చిత్రీకరించాం. రష్మిక డూప్ లేకుండా 80 అడుగుల ఎత్తు నుంచి దూకారు. ఆ సమయంలో ఆమె చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయి. అయినా విరామం తీసుకోకుండా షూటింగ్‌లో పాల్గొన్నారు. ఆమె నిబద్ధత చూసి చిత్రబృందమంతా ఆశ్చర్యపోయిందని తెలిపారు. ఈ చిత్రం కోసం అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్ కెచా ఖంపక్డీ ఆధ్వర్యంలో రష్మిక శిక్షణ పొందినట్లు డైరెక్టర్ వెల్లడించారు. బ్యాంకాక్‌లో వారం రోజుల పాటు ప్రతిరోజూ 8 గంటల పాటు కఠినమైన యుద్ధ విద్యలను నేర్చుకున్నట్లు తెలిపారు. మార్షల్ ఆర్ట్స్, గిరిజన పోరాట పద్ధతులను కలిపి ఈ సినిమా కోసం ఓ కొత్తతరహా యాక్షన్ శైలిని డిజైన్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# వారణాసికి ప్రపంచ మార్కెట్

## పక్కా ప్రణాళికతో చిత్ర బృందం అడుగులు

అగ్ర దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి తన సినిమాలతో పాన్ ఇండియా సహా... మరెన్నో సరికొత్త మార్కెట్లకి దారి వేశారు. ఆ దారి తెలుగు సినిమాలకు గత కొన్నేళ్లుగా రాచబాటగా మారింది. 'బాహుబలి' సినిమాల తర్వాత జపాన్ సహా ఎన్నో దేశాల్లో తెలుగు సినిమాలపై ఆసక్తి పెరిగింది. ఇప్పుడు అదే తరహాలో మరిన్న దేశాల్లో వారణాసిని తీసుకెళ్లేలా దర్శకుడు రాజమౌళి ప్లాన్ వేస్తున్నారు. మార్కెట్‌ను పెంచుకోవడం లక్ష్యంగా ప్రణాళికలు వేస్తున్నారు. వారణాసి' సినిమాతో మరిన్ని కొత్త మార్కెట్లనీ కొల్లగొట్టాలనే ప్రణాళికల్ని ఆ చిత్రబృందం సిద్ధం చేసింది. ముఖ్యంగా దక్షిణ అమెరికాతోపాటు, లాటిన్ అమెరికా దేశాల మార్కెట్‌పైన గురిపెట్టినట్టు తెలుస్తోంది. 'వారణాసి' కథ కూడా పలు దేశాల్లో ముడిపడినది కావడం, కథానాయకుడు ప్రపంచాన్ని చుట్టే సాహసికుడు కావడంతో... మరిన్ని కొత్త దేశాలకు, కొత్త మార్కెట్లకీ ఈ సినిమాని తీసుకెళ్లాలనే ప్రణాళికలతో 'వారణాసి' బృందం ఉంది. అందులో భాగంగానే ఇటీవల మెక్సికోలో జరిగిన కామిక్ కాన్‌లో సినిమాని ప్రచారం చేశారు. రాజమౌళి వీడియో సందేశంతోపాటు, 'వారణాసి' తెరవెనక సన్నివేశాల్ని అందులో ప్రదర్శించారు. తదుపరి బ్రెజిల్‌తోపాటు మరిన్ని దేశాల్లోనూ 'వారణాసి' సినిమాని ప్రచారం చేయనున్నట్టు తెలుస్తోంది. మహేశ్‌బాబు కథానాయకుడిగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్నారు. ఇటీవలే ఓ పాటని తెరకెక్కించారు. మే తొలి వారం నుంచి హైదరాబాద్‌లోనే కొత్త షెడ్యూల్ చిత్రీకరణ ప్రారంభం అవుతుంది. కథానాయకుడు మహేశ్ ఇతర తారాగణంపై కీలక సన్నివేశాల్ని తెరకెక్కించనున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.






# యశ్ టాక్సిక్ విడుదల మరోమారు వాయిదా

కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా, మోస్ట్ టాలెంటెడ్ డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ చిత్రం టాక్సిక్ మరోసారి వాయిదా పడింది. విడుదల తేదీపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. మొదట ఈ చిత్రాన్ని మార్చి 19న విడుదల చేయాలని ప్లాన్ చేసిన మేకర్స్, తర్వాత జూన్ 4కి వాయిదా వేశారు. అయితే ఇప్పుడు ఆ తేదీకి కూడా సినిమా విడుదల కావడం లేదని యష్ స్వయంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగపూరితమైన ప్రకటన విడుదల చేశారు. సినిమా కాన్ ఈవెంట్‌లో 'టాక్సిక్'కు వచ్చిన అంతర్జాతీయ స్పందనతో తమ బాధ్యత మరింత పెరిగిందని యష్ తెలిపారు. భారతీయ సినిమాను గ్లోబల్ స్థాయిలో నిలబెట్టేలా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. షూటింగ్ పూర్తయినప్పటికీ, ప్రస్తుతం గ్లోబల్ డిస్ట్రిబ్యూషన్, అంతర్జాతీయ భాగస్వామ్యాలపై పని జరుగుతోందని వెల్లడించారు. అందుకే త్వరలో కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపారు. ఇక ఈ వాయిదా వెనుక మరికొన్ని కారణాలు కూడా ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. దాదాపు రూ.700 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ఓటీటీ హక్కులపై చర్చలు కొనసాగుతున్నాయి. ఒక ప్రముఖ సంస్థ రూ.110 కోట్లు ఆఫర్ చేయగా, నిర్మాతలు మాత్రం కనీసం రూ.250 కోట్లు ఆశిస్తున్నట్లు సమాచారం. ఈ డీల్ ఇంకా ఖరారు కాకపోవడం కూడా ఆలస్యానికి కారణమైందని తెలుస్తోంది. అలాగే కొన్ని ప్యాచ్ వర్క్ పనులు ఇంకా పూర్తికాకపోవడం, సెన్సార్ ప్రక్రియ ప్రారంభం కాకపోవడం కూడా వాయిదాకు దారితీసిన అంశాలుగా చెబుతున్నారు. అంతేకాకుండా పశ్చిమాసియాలో ఉన్న అనిశ్చిత పరిస్థితులు గ్లోబల్ రిలీజ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో మేకర్స్ జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని సమాచారం. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న కేవీఎన్ ప్రొడక్షన్స్ ప్రస్తుతం ఇతర ప్రాజెక్టుల పనుల్లో బిజీగా ఉండటంతో, పూర్తి స్థాయిలో ప్రమోషన్లపై దృష్టి సారించేందుకు సమయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. కన్నడతో పాటు తెలుగు సహా ఆరు భాషల్లో భారీ స్థాయిలో విడుదలకు సిద్ధమవుతున్న 'టాక్సిక్', భారతీయ సినిమా స్థాయిని మరో మెట్టు ఎక్కించే చిత్రంగా నిలుస్తుందని యష్ నమ్మకం వ్యక్తం చేశారు. విడుదల ఆలస్యమైనా, బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.




# బుర్ర తక్కువై.. హనుమాన్ వదులుకున్నా

## నటి ఫరియా అబ్దుల్లా వ్యాఖ్యలు

బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని అందుకున్న హనుమాన్ సినిమా చిన్న సినిమాగా మొదలై ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధించి కొత్త రికార్డులు సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంతో నటీనటులందరికీ మంచి గుర్తింపు లభించింది. అయితే ఈ బ్లాక్‌బస్టర్ అవకాశాన్ని తానే మిస్ చేసుకున్నానని నటి ఫరియా అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.తాజాగా తన కొత్త సినిమా గాయపడ్డ సింహం మే 1 విడుదలవుతున్న సందర్భంగా ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఫరియా, తన కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకుంది. 'జాతిరత్నాలు' తర్వాత ఇండస్ట్రీలోకి వచ్చిన సమయంలో కథల ఎంపికపై సరైన అవగాహన లేకపోవడం వల్ల 'హనుమాన్' వంటి మంచి ప్రాజెక్ట్‌ను కోల్పోయానని ఆమె తెలిపింది. ఆ సమయంలో స్క్రిప్ట్‌లను ఎలా అంచనా వేయాలో తెలియదు. మంచి కథను గుర్తించడంలో తప్పు చేశాను. నిజం చెప్పాలంటే అప్పుడు ఆలోచించకుండా 'నో' చెప్పాను. ఇప్పుడు సినిమా రిజల్ట్ చూసాక చాలా బాధగా ఉంది అంటూ ఫరియా తన మనసులోని మాటను బయటపెట్టింది. దర్శకుడు ప్రశాంత్ వర్మ, హీరో తేజ సజ్జాలను ఎక్కడ కలిసినా ఈ విషయాన్ని గుర్తుచేసుకుంటానని కూడా తెలిపింది. ఆ సమయంలో నిజంగా నాకు బ్రెయిన్ లేదు. బుద్ధిలేక నో చెప్పాను.. నిజానికి నాకు కథను ఎలా జడ్జ్ చేయాలో తెలియదు. ఇకపై కెరియర్లో కథలు ఎంచుకునే విషయంలో జాగ్రత్తగా ఆచితూచి అడుగులు వేస్తానని తెలిపింది. ఇక ఫరియా వదులుకున్న ఆ పాత్రను చివరకు అమృత అయ్యర్ దక్కించుకోగా, ఆ సినిమాతో ఆమెకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. ఇండస్ట్రీలో ఒకరు వదులుకున్న అవకాశం మరొకరికి వరంగా మారుతుందనే విషయాన్ని ఈ ఉదాహరణ మరోసారి రుజువు చేసింది. ప్రస్తుతం ఫరియా తన ఆశలన్నీ 'గాయపడ్డ సింహం' సినిమాపైనే పెట్టుకుంది. ఈ చిత్రంతో మంచి విజయాన్ని అందుకుని తన కెరీర్‌కు కొత్త ఊపునివ్వాలని భావిస్తోంది.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com